# తెలుగురాష్ట్రం

APTEL/2016/66202

తెలుగు దినపత్రిక

అమలాపురం | సంపుటి : 10 సంచిక : 196 | ఎడిటర్ : ఎ. రాజశేఖర్ | శుక్రవారం 05 సెప్టెంబర్ 2025 | పేజీలు 8 వెల : 5/-

published : Amalapuram Vol:10 Issue : 196 05-09-2025 Editor : A.RAJASEKHAR Pages : 8 Rs: 5/-


### విజయవాడ - బెంగళూరు విమానానికి
## తప్పిన పెను ప్రమాదం

**టేకాఫ్ సమయంలో విమానాన్ని ఢీకొట్టిన పక్షి**

**వెంటనే విమానాన్ని వెనక్కి మళ్లించిన పైలట్**

**సురక్షితంగా బయటపడ్డ 100 మంది ప్రయాణికులు**

గన్నవరం సెప్టెంబర్ 04 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)



గన్నవరం విమానాశ్రయంలో పెను ప్రమాదం త్రుటిలో తప్పింది. విజయవాడ

- తరువాయి 2లో..

### మా బంధం..
## దౌత్యానికి మించినది

### సింగపూర్‌పై మోదీ కీలక వ్యాఖ్యలు

**ఏఐ, గ్రీన్ షిప్పింగ్ వంటి భవిష్యత్ రంగాల్లో సహకారం**

**చెన్నైలో సింగపూర్ సహకారంతో నైపుణ్యాభివృద్ధి కేంద్రం**

**వాణిజ్య ఒప్పందాల సమీక్షకు ఇరు దేశాల నిర్ణయం**

**యూపీఐ-పేనౌ అనుసంధానంలో చేరిన మరో 13 భారత బ్యాంకులు**




భారత్, సింగపూర్ మధ్య సంబంధాలు కేవలం దౌత్యపరమైన అంశాలకే పరిమితం కాదని, ఇరు దేశాల భాగస్వామ్యం సాంప్రదాయ రంగాలను దాటి అత్యాధునిక సాంకేతిక రంగాల వైపు శరవేగంగా విస్తరిస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. సింగపూర్ ప్రధాని లారెన్స్ వాంగ్‌తో కలిసి గురువారం న్యూఢిల్లీలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇరు దేశాల మధ్య సంబంధాలు పరస్పర ప్రయోజనాలే లక్ష్యంగా, శాంతి, శ్రేయస్సు అనే ఉమ్మడి దార్శనికతతో ముందుకు సాగుతున్నాయని మోదీ అన్నారు. సింగపూర్ ప్రధానిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత లారెన్స్ వాంగ్ భారత్‌లో పర్యటించడం ఇదే మొదటిసారి. ఇరు దేశాల మధ్య దౌత్య సంబంధాలు ఏర్పడి 60 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా ఈ పర్యటనకు మరింత ప్రాధాన్యత లభించింది. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ, "భారత్ 'యాక్ట్ ఈస్ట్' విధానంలో సింగపూర్ ఒక కీలకమైన స్తంభం లాంటిది. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో శాంతి, స్థిరత్వం కోసం ఆసియాన్‌తో కలిసి పనిచేయడం కొనసాగిస్తాం" అని పేర్కొన్నారు. భవిష్యత్ భాగస్వామ్యం కోసం ఒక స్పష్టమైన రోడ్‌మ్యాప్‌ను సిద్ధం చేసినట్లు ప్రధాని వెల్లడించారు. ఇకపై సహకారం అధునాతన తయారీ, గ్రీన్ షిప్పింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), క్వాంటం టెక్నాలజీ, పట్టణ నీటి

- తరువాయి 2లో..

## జనవరిలో...
# స్థానిక పోరు..



- ఏపీ ఎన్నికల సంఘం ఏర్పాట్లు
- వచ్చే ఏడాది ఏప్రిల్ లో ముగియనున్న సర్పంచ్ ల పదవీకాలం
- 3 నెలల ముందే ఎన్నికలు నిర్వహించే ఏర్పాట్లలో ఎస్ఈసీ
- పంచాయతీరాజ్‌శాఖ, పురపాలక కమిషనర్లకు ఇప్పటికే లేఖలు







అమరావతి సెప్టెంబర్ 04 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికలు షెడ్యూల్ కంటే మూడు నెలల ముందుగానే జరగనున్నాయి. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఇప్పటికే సన్నాహాలు ప్రారంభించింది. చట్టం ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికలను ఐదేళ్ల పదవీకాలం ముగియడానికి మూడు నెలల ముందే నిర్వహించే వెసులుబాటు ఉంది. ఆ నిబంధనల ఆధారంగా, ఎన్నికల కమిషన్ 2026 జనవరిలో ఎన్నికలు జరపాలని నిర్ణయించింది. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నీలం సాహ్నీ ఈ విషయమై పంచాయతీరాజ్, పురపాలక శాఖల కమిషనర్లకు లేఖలు పంపి ఏర్పాట్లు వెంటనే మొదలుపెట్టాలని ఆదేశించారు.

- తరువాయి 2లో..



**రాష్ట్రపతి ద్రౌపది ముర్ము కొత్త కారుపై**

# జీఎస్టీ ఎత్తివేత..

- రాష్ట్రపతి ద్రౌపది ముర్ము కోసం కొత్త బీఎండబ్ల్యూ కారు కొనుగోలు
- రూ.3.66 కోట్ల విలువైన కారుపై జీఎస్టీ, సెస్సుల మినహాయింపు
- జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో కీలక నిర్ణయం
- ఇది విలాసవంతమైన వాహనం కాదు, దేశ భద్రతకు సంబంధించిన ఆస్తి అని స్పష్టీకరణ
- ప్రస్తుత మెర్సిడెస్ బెంజ్ స్థానంలోకి రానున్న కొత్త బుల్లెట్ ప్రూఫ్ వాహనం
- అత్యంత అరుదుగా ఇచ్చే పన్ను మినహాయింపుల్లో ఇదొకటి

న్యూఢిల్లీ సెప్టెంబర్ 04 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అధికారిక ప్రయాణాల నిమిత్తం కొనుగోలు చేయనున్న అత్యంత భద్రత కలిగిన నూతన బీఎండబ్ల్యూ కారుకు పన్నుల నుంచి పూర్తి మినహాయింపు లభించింది. రూ.3.66 కోట్ల విలువైన ఈ బుల్లెట్ ప్రూఫ్ వాహనంపై విధించాల్సిన ఐజీఎస్టీ, కాంపెన్సేషన్ సెస్సును రద్దు చేస్తూ జీఎస్టీ కౌన్సిల్ కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రపతి వాహనం ఒక విలాసవంతమైన వస్తువు కాదని, దేశ భద్రతకు సంబంధించిన వ్యూహాత్మక ఆస్తి అనే ప్రత్యేక కారణంతో ఈ వెసులుబాటు కల్పించారు. సాధారణంగా ఇలాంటి విదేశీ కార్ల దిగుమతిపై 28 శాతం ఐజీఎస్టీతో పాటు కస్టమ్స్ సుంకం, అదనపు సెస్సులు భారీగా ఉంటాయి. అయితే, రాష్ట్రపతి భద్రత దృష్ట్యా ఈ వాహనం అత్యంత

- తరువాయి 2లో..

## చంద్రబాబు కేబినెట్ కీలక నిర్ణయం..

**ఇకపై రూ.25 లక్షల వరకు..**

# ఉచిత వైద్యం!

- యూనివర్సల్ హెల్త్ పాలసీకి ఏపీ కేబినెట్ ఆమోదం
- ప్రతి కుటుంబానికి ఏటా రూ. 25 లక్షల ఆరోగ్య బీమా
- రాష్ట్రవ్యాప్తంగా 1.63 కోట్ల కుటుంబాలకు లబ్ధి
- ఆరు గంటల్లోనే వైద్య చికిత్సకు అనుమతులు
- 2,493 నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో ఉచిత వైద్య సేవలు
- మొత్తం 3,257 రకాల చికిత్సలు అందుబాటులోకి





అమరావతి సెప్టెంబర్ 04 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

ఆంధ్రప్రదేశ్ ప్రజల ఆరోగ్య భద్రత దిశగా ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని ప్రభుత్వం ఒక చారిత్రక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి ఏటా రూ.25 లక్షల వరకు ఉచిత వైద్యం అందించే 'యూనివర్సల్ హెల్త్ పాలసీ'కి రాష్ట్ర మంత్రివర్గం ఆమోదముద్ర వేసింది. గురువారం అమరావతిలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన కేబినెట్ సమావేశంలో ఈ మేరకు కీలక నిర్ణయం తీసుకున్నారు.

- తరువాయి 2లో..



### పిఠాపురం నియోజకవర్గంలోని ఉపాధ్యాయులకు
## పవన్ కళ్యాణ్ ప్రత్యేక కానుకలు

- పిఠాపురంలో ఒకరోజు ముందే మొదలైన ఉపాధ్యాయ దినోత్సవ సందడి
- నియోజకవర్గంలోని 2 వేల మంది గురువులకు పవన్ కళ్యాణ్ కానుకలు
- మహిళా టీచర్లకు చీరలు, పురుషులకు ప్యాంటు-షర్టు క్లాత్‌ల అందజేత

అమరావతి సెప్టెంబర్ 04 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం నియోజకవర్గంలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఒకరోజు ముందుగానే ప్రారంభమయ్యాయి. గురుపూజోత్సవాన్ని పురస్కరించుకుని పవన్ కళ్యాణ్ తన నియోజకవర్గంలోని ఉపాధ్యాయులు, అధ్యాపకులకు ప్రత్యేక బహుమతులు పంపి వారిని గౌరవించారు. నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న సుమారు 2 వేల మంది ఉపాధ్యాయులు, అధ్యాపకులకు ఈ కానుకలు అందజేశారు. మహిళా

- తరువాయి 2లో..





### పారదర్శకంగా యూరియా
## సరఫరా చేస్తున్నాం

**గత ప్రభుత్వంలో కన్నా ఎక్కువ యూరియా మార్క్ ఫెడ్ ద్వారా పంపిణీ చేశాం**

**కృత్రిమ కొరత సృష్టించి బ్లాక్ మార్కెట్ కు తరలించామనే వార్త పూర్తిగా అవాస్తవం**

**ఈ-కేవైసీ పూర్తయిన రైతులకు అన్నదాత సుఖీభవ నగదు జమ**

**వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు**



అమరావతి సెప్టెంబర్ 04 (తెలుగురాష్ట్రం ప్రతినిధి):

రాష్ట్ర వ్యాప్తంగా రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని యూరియా సరఫరా, పంపిణీని ప్రభుత్వం పూర్తిగా పారదర్శకంగా నిర్వహిస్తోందని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ప్రతి ఒక్కరికి అవసరమైనంత యూరియా సమయానికి అందేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రతి జిల్లాలో యూరియా సరఫరా, పంపిణీ వ్యవస్థను పర్యవేక్షిస్తూ, ఎక్కడా కొరత తలెత్తకుండా

- తరువాయి 2లో..

## డీఎస్సీతో 16 వేల పోస్టులను విజయవంతంగా భర్తీ చేశాం

అమరావతి సెప్టెంబర్ 04 (తెలుగురాష్ట్రం ప్రతినిధి):



రాష్ట్రంలో 16 వేల పైచిలుకు ఉపాధ్యాయ పోస్టులను విజయవంతంగా భర్తీ చేశామని మంత్రి నారా లోకేశ్ తెలిపారు. జగన్ ఒక్క డీఎస్సీని కూడా నిర్వహించలేదని విమర్శించారు. క్యాబినెట్ భేటీకి ముందు మంత్రులతో నారా లోకేశ్ సమావేశమయ్యారు. డీఎస్సీ అభ్యర్థులతో అభినందన సభ పెడితే బాగుంటుందని లోకేశ్‌కు మంత్రులు సూచించారు. గతేడాది ఇదే సమయంలో తలెత్తిన బుడమేరు వరదపై లోకేశ్ చర్చించారు. జగన్ ఐదేళ్ల నిర్వాకంతో బుడమేరు కట్ట తెగి సమస్యలు ఎదుర్కొన్నామన్నారు. గత అనుభవాలతో ఈసారి అప్రమత్తంగా ఉన్నట్లు తెలిపారు. అన్ని శాఖల సమన్వయంతో సవాళ్లు దీటుగా ఎదుర్కొన్నామని వివరించారు. ఇన్‌ఛార్జి మంత్రులు నియోజకవర్గాల్లో కార్యకర్తల్ని కలవాలని కోరారు. వారి సమస్యల పరిష్కారానికి గ్రీవెన్స్‌లు నిర్వహించాలని సూచించారు. జిల్లాల్లో ఎక్కడైనా యూరియా సమస్య ఉందా అని లోకేశ్ ఆరా తీశారు. అన్ని జిల్లాల్లో తగినంత యూరియా లభ్యత ఉందని మంత్రులు వివరించారు. రైతుల ముసుగులో వైకాపా నేతలు చేస్తున్న కుతంత్రాలను దీటుగా తిప్పికొట్టాలన్నారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి రోజు తల్లి పట్ల జగన్ వ్యవహరించిన తీరును రాష్ట్రమంతా చూసిందన్నారు. కన్న తల్లినే సరిగా పట్టించుకోని సైకోయిజం జగన్ రూపంలోనే చూశామని పేర్కొన్నారు. జీఎస్టీ శ్లాబ్‌లు కుదించి నిత్యావసరాల ధరలు తగ్గించడం చరిత్రాత్మక సంస్కరణ అని లోకేశ్ తెలిపారు. సంస్కరణలు చేపట్టిన ప్రధాని మోదీకి లోకేశ్ కృతజ్ఞతలు తెలిపారు.

### నేడు ప్రధాని మోదీతో
## మంత్రి లోకేశ్ భేటీ..

- ఢిల్లీకి పయనం
- మర్యాదపూర్వకంగానే ప్రధానితో సమావేశం
- భేటీ అనంతరం రేపు మధ్యాహ్నం రాష్ట్రానికి తిరుగుపయనం
- అమరావతిలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో పాల్గొననున్న మంత్రి
- 'ఎక్స్' వేదికగా జీఎస్టీ సంస్కరణలను స్వాగతించిన లోకేశ్

అమరావతి సెప్టెంబర్ 04 (తెలుగురాష్ట్రం ప్రతినిధి):

ఏపీ మానవ వనరుల అభివృద్ధి, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ ఢిల్లీలో పర్యటించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఆయన సెప్టెంబర్ 5వ తేదీ ఉదయం ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో సమావేశం కానున్నారు. ఈ భేటీ కోసం మంత్రి లోకేశ్ ఈరోజు రాత్రే ఢిల్లీకి బయలుదేరి వెళ్లనున్నారు. ప్రధాని మోదీతో మంత్రి లోకేశ్ జరపనున్న ఈ సమావేశం పూర్తిగా మర్యాదపూర్వక భేటీ అని అధికారిక వర్గాలు వెల్లడించాయి. ఢిల్లీలో ప్రధానితో సమావేశం ముగిసిన వెంటనే మంత్రి లోకేశ్ తిరిగి రాష్ట్రానికి పయనం కానున్నారు. రేపు మధ్యాహ్నానికల్లా ఆయన రాష్ట్రానికి చేరుకుంటారని సమాచారం. అనంతరం ఆయన నేరుగా అమరావతిలో

- తరువాయి 2లో..



# సంపాదకీయం

## సెమీకండక్టర్ దేశంగా భారత్

సెమీకండక్టర్ మిషన్ రెండో దశ వైపు భారతదేశం ముందుకు సాగుతోందని, భారత్‌లో తయారయ్యే చిన్న సిలికాన్ చిప్‌లు ప్రపంచవ్యాప్తంగా భారీ మార్పును తీసుకొచ్చే రోజులు అతిత్వరలో రానున్నాయని ప్రధాని నరేంద్రమోడీ మంగళవారం సెమికాన్ ఇండియా సదస్సులో ప్రకటించడం ఎంతో ప్రాధాన్యత సంతరించుకుంది. నేటి సాంకేతికత ఆధారిత ప్రపంచంలో సెమీకండక్టర్లు ఎంతో కీలకమైనవి. దాదాపు ప్రతి పరిశ్రమలోనూ వీటికి విస్తృతమైన డిమాండ్ ఉంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (కృత్రిమ మేధ), క్వాంటమ్ కంప్యూటింగ్, పునరుత్పాదక ఇంధనం, తదితర రంగాలకు సెమీకండక్టర్ల అవసరం చాలా ఉంటోంది. ఎలక్ట్రానిక్స్‌లో కీలకమైన భాగాలు, కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లు, స్మార్ట్ టివిలు, మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ గాడ్జెట్లు, డిజిటల్ కెమెరాలు ఇలా ఒకటేమిటి ప్రస్తుత ప్రపంచంలో వీటి అవసరం లేని ఏ పరికరం లేదు.

ముఖ్యంగా 2020 నుండి దాదాపు అన్ని ఆధునిక పరికరాలు, ఎలక్ట్రానిక్ పరికరాలు సెమీకండక్టర్లపై ఆధారపడి ఉండటంతో సెమీకండక్టర్లకు ప్రపంచవ్యాప్తంగా డిమాండ్ పెరిగింది. కానీ దీనికి తగ్గట్టు సరఫరా ఉండడం లేదు. కరోనా మహమ్మారి ప్రకంపనలు, రష్యా ఉక్రెయిన్ యుద్ధం కొనసాగుతుండడం ఇవన్నీ చిప్‌ల సరఫరాకు తీవ్ర ప్రతిబంధకాలుగా మారాయి. ప్రపంచవ్యాప్తంగా వీటి కొరత తీవ్రంగా ఉంటోంది. ప్రపంచ వ్యాప్తంగా తైవాన్, దక్షిణ కొరియా, చైనా, అమెరికా దేశాలు సెమీకండక్టర్ల ఉత్పత్తిలో ముందంజలో ఉన్నాయి. ప్రపంచం మొత్తం మీద ఉత్పత్తి అయ్యే చిప్‌ల్లో 60 శాతం కంటే ఎక్కువ చిప్‌లను తైవాన్ తయారు చేయగలుగుతోంది. దక్షిణ కొరియా శామ్‌సంగ్ ఎలక్ట్రానిక్స్ వంటి కంపెనీల ద్వారా అధునాతన చిప్ తయారీ చేస్తోంది. ఈ నేపథ్యంలో సెమీకండక్టర్ తయారీని ప్రోత్సహించడానికి భారత ప్రభుత్వం గణనీయమైన ప్రోత్సాహకాలను ప్రవేశపెట్టింది.

టాటా, వేదాంత, అదానీ వంటి కంపెనీలు ఈ రంగంలోకి ప్రవేశించడానికి సిద్ధమవుతున్నాయి. స్వదేశీయంగా మొట్టమొదటి చిప్‌ను ఈ ఏడాది ఆఖరికి తయారు చేస్తామని గత వారం సిజి సెమీ (మురుగప్ప గ్రూపు) ప్రకటించడం విశేషం. కేంద్ర కేబినెట్ నాలుగు సెమీకండక్టర్ల ప్రాజెక్టులకు ఆమోదం తెలిపిన కొన్ని రోజులకే సిజి సెమీ ప్రకటన వచ్చింది. ఇప్పుడు 10 సెమీకండక్టర్ల ప్రాజెక్టులు 18 బిలియన్ డాలర్లతో నిర్మాణంలో ఉన్నాయి. టాటా గ్రూపు భాగస్వామ్యం తో తైవాన్ పవర్ చిప్ సెమీకండక్టర్ మాన్యుఫ్యాక్చరింగ్ కార్పొరేషన్ చిప్‌ల తయారీకి సిద్ధమైంది. తాజా ఆమోదాలతో 1.6 లక్షల కోట్లతో ఆరు రాష్ట్రాల్లో సెమీకండక్టర్ ప్రాజెక్టులు వస్తుండడం శుభపరిణామం. అయితే చాలా మంది ఈ పెట్టుబడులు, లక్ష్యాలు చాలా స్వల్పంగా వాదిస్తున్నా, కొన్ని దశాబ్దాలుగా ఈ అవకాశాలు లభించని పరిస్థితుల్లో ఈమేరకు ఒక కదలిక రావడం విశేషంగా భావించవచ్చు.

ట్రిలియన్ డాలర్ల ప్రపంచ చిప్ మార్కెట్‌ను అధిగమించేందుకు డిజైన్ అనుసంధానిత రాయితీ పథకాన్ని (డిజైన్ లింక్డ్ ఇన్‌సెంటివ్ స్కీమ్)ను పునరుద్ధరిస్తామని ప్రధాని నరేంద్ర మోడీ మంగళవారం వెల్లడించారు. అమెరికా వంటి దేశాలకు రక్షణ వాదం, ఆయుధీకరణ పెరగడంతో చిప్ వ్యాపారం డిమాండ్ విస్తృతమై ఆందోళన కలిగిస్తోంది. ఈ పరిస్థితుల్లో భారత్ వీటి కోసం ఇతర దేశాలపై ఆధారపడకుండా స్వదేశీ తయారీపై దృష్టి కేంద్రీకరించడం ఎంతో ముఖ్యం. ఈ ప్రాజెక్టులకు తగిన పెట్టుబడులు పెట్టడానికి అంతా సిద్ధమైంది. ఆయా రాష్ట్రాలు కూడా ఈ ప్రాజెక్టుల క్లియరెన్స్‌లో ఎలాంటి జాప్యం లేకుండా సహకరిస్తే భారత దేశంలో రోజుకు 95 మిలియన్ చిప్‌లు తయారు చేయగల సామర్థ్యం లభిస్తుంది. భారత దేశ సెమీకండక్టర్ల మార్కెట్ 2021లో 27.2 బిలియన్ల డాలర్లు కాగా, ఏటా సుమారు 19 శాతం పెరిగి 2023లో 64 బిలియన్ డాలర్లకు చేరుకుంది.

2026 నాటికి 80 బిలియన్ డాలర్లకు, 2030 నాటికి 110 బిలియన్ డాలర్లకు చేరుకుంటుందని అంచనా. ప్రపంచం మొత్తం మీద ఒక ట్రిలియన్ డాలర్ల విలువైన చిప్ విక్రయాల్లో 8 నుంచి 10 శాతం భారత చిప్‌లు చోటు చేసుకుంటాయని భారత్ అంచనా వేస్తోంది. అయితే ఈ ప్లాంట్లకు క్షేత్రస్థాయిలో తగిన మౌలిక సదుపాయాలు కల్పించవలసిన అవసరం ఉంది. చాలా దేశాలు వీటిని భారీ ఎత్తున ఉత్పత్తి చేయడానికి సన్నాహాలు చేస్తున్నాయి. ఆ మేరకు సౌకర్యాలు, భారీ రాయితీలు కల్పిస్తున్నాయి. అమెరికా, చైనా, యూరోపియన్ యూనియన్, జపాన్, దక్షిణ కొరియా, తైవాన్ దేశాల్లో ఈ ప్లాంట్లకు సబ్సిడీలు దాదాపు 388 బిలియన్ డాలర్ల వరకు ఉంటున్నాయి. భారత్‌లో ప్రస్తుతం ఒకే ఒక మెగా ప్లాంట్ నిర్మాణంలో ఉండగా, చైనాలో 44, జపాన్‌లో 12, తైవాన్‌లో 14, యూరప్‌లో 10, అమెరికాలో 15 మెగా ప్లాంట్లు నిర్మాణమవుతున్నాయి.

భారత్‌లో అవుట్‌సోర్స్‌డ్ సెమీకండక్టర్ అసెంబ్లీ అండ్ టెస్ట్ (ఒఎస్‌ఎటి), అసెంబ్లీ, టెస్టింగ్, మార్కింగ్, ప్యాకేజింగ్, (ఎటిఎంపి) ప్లాంట్లుకు సంబంధించి ఏడు ప్రాజెక్టులకు గ్రీన్ సిగ్నల్ లభించింది. డిజైన్ ఇండియా, మేడ్ ఇన్ ఇండియా, ట్రస్టెడ్ బై ద వరల్డ్ అనే పేరు ప్రపంచానికి త్వరలో వినిపించాలంటే ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించడం తక్షణ అవసరం. ముఖ్యంగా గమనించవలసిన ఇంకో విషయం దేశంలో సెమీకండక్టర్ల తయారీ నాణ్యత లోపం ఎక్కువగా ఉంటోంది. 2030 నాటికి 5,00,000 నుంచి ఒక మిలియన్ వరకు నిపుణులు కావలసి వస్తుంది. ఈ డిమాండ్‌ను అధిగమించాలంటే స్కిల్ ఇండియా సెమీకండక్టర్ ప్రోగ్రామ్ వంటి ప్రణాళికలను తక్షణం అమలులోకి తీసుకురాకతప్పదు. పారిశ్రామిక రంగం, విద్యారంగం, ప్రభుత్వ భాగస్వామ్యంతో అత్యంత వేగంగా నైపుణ్యాభివృద్ధిని సాధించవలసి ఉంటుంది.

# పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మకు గన్‌మన్ల కేటాయింపు..


## కీలక పదవి దక్కబోతోందనే ఊహాగానాలు

- పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మకు (1+1) గన్‌మన్లు
- పవన్ కల్యాణ్ కోసం సీటు త్యాగం చేసిన వర్మ
- కొన్ని రోజుల క్రితం చంద్రబాబును కలిసిన వర్మ

**అమరావతి సెప్టెంబర్ 04 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత, పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్‌ఎన్ వర్మకు భద్రతను కల్పించింది. ఆయనకు (1+1) పద్ధతిలో గన్‌మన్లను కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇద్దరు గన్‌మన్లు వర్మ వద్ద ఈరోజు విధుల్లో చేరారు. ఈ పరిణామం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చకు దారితీసింది.

విశ్వసనీయ సమాచారం ప్రకారం, తనకు భద్రత కల్పించాలని వర్మ స్వయంగా ప్రభుత్వాన్ని కోరారు. ఆయన విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకున్న ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. అయితే, వర్మకు భద్రత అవసరమని తమ శాఖ నుంచి ఎలాంటి నివేదిక ఇవ్వలేదని ఇంటెలిజెన్స్ వర్గాలు అంటున్నట్లు తెలుస్తోంది. కేవలం వర్మ అభ్యర్థన మేరకే ప్రభుత్వం ఆయనకు సెక్యూరిటీని కేటాయించడం గమనార్హం. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో జనసేన అధినేత పవన్ కల్యాణ్ కోసం వర్మ తన పిఠాపురం సీటును త్యాగం చేసిన విషయం తెలిసిందే. పవన్ గెలుపు కోసం ఆయన అహర్నిశలు కృషి చేశారు. ఆ ఎన్నికల్లో పవన్ కల్యాణ్ భారీ మెజారిటీతో గెలుపొందారు. ఈ నేపథ్యంలో వర్మ త్యాగానికి తగిన గుర్తింపు లభిస్తుందని,



ఆయనకు కీలకమైన నామినేటెడ్ పదవి ఇస్తారని జోరుగా ప్రచారం జరిగింది. కొన్ని రోజుల క్రితం ముఖ్యమంత్రి చంద్రబాబుతో వర్మ భేటీ అయ్యారు. ఆ సందర్భంగా నియోజకవర్గ పరిస్థితులు, ఇతర రాజకీయ అంశాలపై చర్చించినట్లు సమాచారం. ఈ భేటీ జరిగిన కొద్ది రోజులకే ఆయనకు భద్రత కల్పించడం ప్రాధాన్యత సంతరించుకుంది. దీంతో, వర్మకు త్వరలోనే ఏదైనా కీలక పదవి దక్కవచ్చనే ఊహాగానాలకు ఈ పరిణామం మరింత బలాన్నిచ్చింది.

## మా బంధం.. దౌత్యానికి మించినది

నిర్వహణ వంటి నూతన రంగాలకు విస్తరిస్తుందని తెలిపారు. ఇందులో భాగంగా సింగపూర్ సహకారంతో చెన్నైలో 'నేషనల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ స్కిల్లింగ్' ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. ఈ కేంద్రం ద్వారా అధునాతన తయారీ రంగంలో అవసరమైన నైపుణ్యం కలిగిన మానవ వనరులను తీర్చిదిద్దుతామని వివరించారు. డిజిటల్ కనెక్టివిటీలో భాగంగా ఇప్పటికే విజయవంతమైన యూపీఐ-పేనౌ అనుసంధానంలో కొత్తగా మరో 13 భారతీయ బ్యాంకులు చేరినట్లు మోదీ తెలిపారు. ద్వైపాక్షిక సమగ్ర ఆర్థిక సహకార ఒప్పందంతో (%జజుజూ%) పాటు, ఆసియాన్‌తో ఉన్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని కూడా నిర్ణీత సమయంలో సమీక్షించాలని ఇరు దేశాలు నిర్ణయించాయని ఆయన పేర్కొన్నారు. గుజరాత్‌లోని గిఫ్ట్ సిటీ ఇరు దేశాల స్టాక్ మార్కెట్లను కలుపుతూ ఒక వారధిగా నిలుస్తోందని ప్రధాని మోదీ అన్నారు. ఆగ్నేయాసియాలో సింగపూర్ భారత్‌కు అతిపెద్ద వాణిజ్య భాగస్వామి అని, రక్షణ సంబంధాలు కూడా రోజురోజుకు బలపడుతున్నాయని ఆయన గుర్తు చేశారు.

## జనవరిలో... 'స్థానిక' పోరు

ప్రస్తుత పదవీకాలం ముగింపు తేదీలు: ప్రస్తుత సర్పంచుల పదవీకాలం 2026 ఏప్రిల్‌లో ముగియనుంది. అదే సమయంలో నగరపాలక సంస్థలు, పురపాలక సంస్థలు, నగర పంచాయతీలలోని కార్పొరేటర్లు, కౌన్సిలర్ల పదవీకాలం 2026 మార్చిలో పూర్తవుతుంది. అంటే ఈ రెండు కీలక స్థానిక సంస్థల పదవీకాలాలు మధ్య పెద్ద తేడా లేదు. కాబట్టి పదవీకాలం పూర్తయ్యేలోపు ఎన్నికల ప్రక్రియ ముగించేందుకు ఇప్పటి నుంచే ప్రణాళికలు వేయాలని ఎన్నికల సంఘం నిర్ణయించింది.

**ఎన్నికల కమిషనర్ లేఖ ప్రకారం ఎన్నికల నిర్వహణకు షెడ్యూల్ ఇలా:**

- ఎన్నికల నిర్వహణ కోసం రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఇప్పటి నుంచే ఏర్పాట్లు మొదలుపెట్టింది.
- 2025 అక్టోబరు 15వ తేదీలోపు – వార్డుల పునర్విభజన, రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తి చేయాలి.
- అక్టోబరు 16 నుంచి నవంబరు 15వ తేదీలోపు – వార్డుల వారీగా ఓటర్ల జాబితాలను సిద్ధం చేసి, ప్రచురించాలి.
- నవంబరు 1 నుంచి 15వ తేదీ లోపు – ఎన్నికల అధికారుల నియామకం జరగాలి.
- నవంబరు 16 నుంచి 30వ తేదీలోపు – పోలింగ్ కేంద్రాల ఖరారు చేసి, ఈవీఎంల సేకరణ, సిద్ధం వంటి ప్రక్రియలు పూర్తి చేయాలి.
- డిసెంబరు 15వ తేదీలోపు – రిజర్వేషన్లు ఖరారు చేయాలి.
- డిసెంబరు చివరి వారంలో – రాజకీయ పార్టీలతో సమావేశాలు జరిపి, సూచనలు స్వీకరించాలి.
- 2026 జనవరిలో – ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసి, అదే నెలలో పోలింగ్ జరిపి ఫలితాలు ప్రకటించాలి.
- ముందస్తు ఏర్పాట్ల ప్రాముఖ్యత: స్థానిక సంస్థలు ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా పరిష్కరించే వేదికలు. సర్పంచులు, కార్పొరేటర్లు, కౌన్సిలర్లు స్థానిక స్థాయిలో అభివృద్ధి పనులకు దిశానిర్దేశం చేస్తారు. వీరి పదవీకాలం పూర్తయిన తర్వాత ఖాళీ ఏర్పడకుండా ఎన్నికలు ముందుగానే జరపడం వల్ల పరిపాలనలో అంతరాయం ఉండదు. కొత్తగా ఎన్నికైన సభ్యులు సమయానికి బాధ్యతలు స్వీకరించి, అభివృద్ధి కార్యక్రమాలు నిరంతరాయంగా కొనసాగించగలరు.
- రాష్ట్ర ఎన్నికల సంఘం ఈసారి మరింత పారదర్శకంగా, సజావుగా ఎన్నికలు నిర్వహించేందుకు ప్రణాళికలు వేసింది. ఓటర్ల జాబితాల ఖచ్చితత్వం, రిజర్వేషన్ల స్పష్టత, పోలింగ్ కేంద్రాల సమగ్ర ఏర్పాట్లు, ఈవీఎంలు సమయానికి అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఇప్పటికే జిల్లా స్థాయి అధికారులకు సూచనలు చేసింది.
- ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికలు 2026 జనవరిలో జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. అక్టోబరు 2025 నుంచే సన్నాహాలు ప్రారంభించి, డిసెంబరులోనే అన్ని ఏర్పాట్లు పూర్తికానున్నాయి. ఈ విధంగా ఎన్నికల సంఘం ప్రణాళిక వల్ల స్థానిక సంస్థల పాలనలో ఎటువంటి ఖాళీ లేకుండా ప్రజాస్వామ్య వ్యవస్థ నిరంతరాయంగా కొనసాగుతుందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.?

## రాష్ట్రపతి ద్రౌపది ముర్ము కొత్త కారుపై జీఎస్టీ ఎత్తివేత..

ఆవశ్యకమని భావించిన జీఎస్టీ కౌన్సిల్ ఫిట్‌మెంట్ కమిటీ, పన్ను మినహాయింపు కోసం ప్రతిపాదించింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రతినిధులతో కూడిన జీఎస్టీ కౌన్సిల్ ఈ ప్రతిపాదనను ఆమోదించింది. దీంతో రాష్ట్రపతి సచివాలయం ఎటువంటి పన్ను భారం లేకుండా ఈ వాహనాన్ని సమకూర్చుకోనుంది. ప్రస్తుతం రాష్ట్రపతి కాన్వాయ్‌లో మెర్సిడెస్ బెంజ్ ఎస్600 పుల్‌మ్యాన్ గార్డ్ లిమోసిన్ వాహనాన్ని వినియోగిస్తున్నారు. దీని స్థానంలో ఇప్పుడు అత్యాధునిక బీఎండబ్ల్యూ సెడాన్ చేరనుంది. ప్రస్తుతం వాడుతున్న కారులో బుల్లెట్ల నుంచి, పేలుళ్ల నుంచి రక్షణ కల్పించే వ్యవస్థలు, మల్టీ లేయర్ బుల్లెట్ ప్రూఫ్ గ్లాస్, దాడులు జరిగినప్పుడు దానంతట అదే మూసుకుపోయే ఫ్యూయల్ ట్యాంక్, ప్రత్యేక ఆక్సిజన్ సరఫరా వ్యవస్థ వంటివి ఉన్నాయి. కొత్తగా రాబోయే బీఎండబ్ల్యూ కారులో ఇంతకంటే అధునాతన భద్రతా ప్రమాణాలు ఉంటాయని అంచనా వేస్తున్నారు. ఇలాంటి పన్ను మినహాయింపులు చాలా అరుదని, కేవలం ప్రజా ప్రయోజనాల దృష్ట్యా, ప్రత్యేక కేసుల్లో మాత్రమే ప్రభుత్వం అనుమతిస్తుందని అధికారులు తెలిపారు.

## ఇకపై రూ.25 లక్షల వరకు.. ఉచిత వైద్యం!

'ఆయుష్మాన్ భారత్ – ఎన్టీఆర్ వైద్య సేవ' పథకం కింద ఈ కొత్త విధానాన్ని అమలు చేయనున్నారు. ఈ నిర్ణయంతో రాష్ట్రంలోని అర్హులైన సుమారు కోటి 63 లక్షల కుటుంబాలకు భారీ ప్రయోజనం చేకూరనుంది. అత్యవసర సమయాల్లో వైద్యం కోసం పేద, మధ్యతరగతి ప్రజలు అప్పులపాలు కాకుండా చూసేందుకు ఈ పథకం దోహదపడనుంది. ఈ పథకం అమలులో వేగం, పారదర్శకతకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇచ్చింది. వైద్య చికిత్సలకు కేవలం 6 గంటల్లోనే అనుమతులు మంజూరు చేసేలా ప్రత్యేకంగా 'ప్రీ ఆథరైజేషన్ మేనేజ్‌మెంట్' వ్యవస్థను ఏర్పాటు చేయనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఎంపిక చేసిన 2,493 నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో ప్రజలకు ఉచితంగా వైద్య సేవలు అందుబాటులో ఉంటాయి. హైబ్రిడ్ విధానంలో మొత్తం 3,257 రకాల చికిత్సలను ఈ పథకం పరిధిలోకి తీసుకొచ్చారు. ఈ పాలసీ ప్రకారం, రూ. 2.5 లక్షల లోపు వైద్య చికిత్సల క్లెయిమ్‌లను ఇన్సూరెన్స్ కంపెనీలు పర్యవేక్షిస్తాయి. రూ. 2.5 లక్షల నుంచి రూ. 25 లక్షల వరకు అయ్యే భారీ వైద్య ఖర్చులను ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్ట్ ద్వారా నేరుగా రాష్ట్ర ప్రభుత్వమే భరించనుంది. ఉదయం 11 గంటలకు ప్రారంభమైన ఈ సమావేశంలో మంత్రులతో చర్చించిన అనంతరం సీఎం చంద్రబాబు ఈ కీలక నిర్ణయాలకు ఆమోదం తెలిపారు.

## పిఠాపురం నియోజకవర్గంలోని ఉపాధ్యాయులకు పవన్ కల్యాణ్ ప్రత్యేక కానుకలు

టీచర్లకు చీరలు, పురుషులకు ప్యాంటు-షర్టు క్లాత్‌లను బహుమతులుగా అందించారు. ఈ ఉదయాన్నే పవన్ కల్యాణ్ ఏర్పాటు చేసిన ప్రత్యేక బృందాలు పిఠాపురం, కొత్తపల్లి, గొల్లప్రోలు మండలాల విద్యాశాఖ కార్యాలయాలకు చేరుకున్నాయి. అక్కడ ఈ బహుమతులను ఉపాధ్యాయులకు, అధ్యాపకులకు పంపిణీ చేశాయి. తమ శాసనసభ్యుడు, డిప్యూటీ సీఎం హోదాలో ఉన్న పవన్ కల్యాణ్ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని తమను గుర్తుంచుకుని కానుకలు పంపడం పట్ల పలువురు ఉపాధ్యాయులు, అధ్యాపకులు ఆనందం వ్యక్తం చేశారు.

## పారదర్శకంగా యూరియా సరఫరా చేస్తున్నాం

తగినన్ని నిల్వలు సిద్ధం చేశామని, ఏవైనా అవకతవకలు లేకుండా రైతులకు నేరుగా యూరియా చేరేలా కఠిన చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. రైతుల ప్రయోజనమే ప్రభుత్వ లక్ష్యమని, యూరియా సరఫరాలో అవినీతి, అక్రమాలకు అవకాశం లేకుండా పారదర్శక విధానాన్ని అమలు చేస్తూ, ఎక్కడ సమస్య తలెత్తినా వెంటనే పరిష్కరించేలా వ్యవస్థను ఏర్పాటు చేశామని అన్నారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, యూరియా సమృద్ధిగా లభ్యమవుతుందని, తప్పుడు కథనాలు, మాటలు నమ్మొద్దని సూచించారు. యూరియా సరఫరా లో గత వైసిపి ప్రభుత్వం కన్నా 48,478 మెట్రిక్ టన్నుల యూరియాను అధికంగా మార్క్ ఫెడ్ ద్వారా రైతులకు పంపిణీ చేశామని మంత్రి తెలిపారు. కృత్రిమ కొరత సృష్టించి బ్లాక్ మార్కెట్ కు తరలించామనే వార్త పూర్తిగా అవాస్తవమని అన్నారు. గత ప్రభుత్వం లో మార్క్ ఫెడ్ ద్వారా సొసైటీలకు ఎరువుల సరఫరా నిర్వీర్యం చేస్తే కూటమి ప్రభుత్వం మార్క్ ఫెడ్ ను గాడిలో పెట్టి సొసైటీలకు అధిక మొత్తంలో యూరియా సరఫరా చేసి గ్రామీణ రైతాంగానికి అందుబాటులో ఉంచిన విషయం గుర్తించాలని తెలిపారు. గతానికి భిన్నంగా మార్క్ ఫెడ్ : ప్రైవేట్ పంపిణీ నిష్పత్తి ని 50 : 50 నుండి 70:30 పెంచామని, మార్కె ఫెడ్ ద్వారా (ఆర్ ఎస్ కే, పీఏసీఎస్) 20% ఎక్కువగా యూరియాను పంపిణీ చేసిన ఘనత కూటమి ప్రభుత్వానిది దక్కుతుందన్నారు. 2021- 22 నుండి 2023 - 24 వరకు గత వైసిపి మూడు సంవత్సరాల సరాసరి యూరియా సరఫరా కేవలం 1,55,617 మెట్రిక్ టన్నులు కాగా ఈ ఒక్క సంవత్సరం(2025- 26)లో ఆగస్టు చివరి నాటికి 2,04,096 మెట్రిక్ టన్నుల యూరియాను రైతులకు సరఫరా చేసామని అన్నారు. గతంతో పోలిస్తే ఈ సంవత్సరం యూరియా సరఫరా 31% శాతం గతం కంటే ఎక్కువ అని తెలిపారు. ఏ ఒక్క రైతుకు యూరియా అందని పరిస్థితి రాకూడదనేది ముఖ్యమంత్రి చంద్రబాబు ఆకాంక్షఅని, రైతు శ్రేయస్సు కూటమి ప్రభుత్వం లక్ష్యం అని అన్నారు. విజిలెన్స్ రెవెన్యూ అధికారుల నిరంతర నిఘా, క్రమం తప్పని తనిఖీల ద్వారా అందుబాటు ధరలోనే మార్కెట్ లో యూరియా లభిస్తుందని, ఎటువంటి బ్లాక్ మార్కెట్ లేదని స్పష్టం చేశారు. ఎటువంటి రాద్ధాంతం చేయకుండా క్రమశిక్షణతో వరుసగా లైన్ లో సాగుతూ ఎరువులను తీసుకుంటున్న రైతులను మెచ్చుకుంటూ వాడుక భాషలో అందరికి అర్థమయ్యే విధంగా బఫే మాదిరిగా అన్న పదానికి వక్రభాష్యం పలకటం వైసీపీ వారి చౌక బారుతనానికి నిదర్శనని ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక చొరవ చూపించి ఎప్పటికప్పుడు కేంద్రంతో సంప్రదింపులు జరపడం ద్వారా మన రాష్ట్రానికి క్లిష్టమైన పరిస్థితుల్లో కూడా ఇతర రాష్ట్రాల కంటే అధిక మొత్తంలో యూరియాను కేంద్రం కేటాయించిందని తెలిపారు. ఇప్పటివరకు గత ఏడాది కన్నా 87,880 మెట్రిక్ టన్నుల యూరియాను వివిధ పంటలకు రాష్ట్ర రైతాంగం వినియోగించిందన్నారు. రాష్ట్రంలో యూరియా సరఫరా, పంపిణీ విషయంలో రైతులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చేస్తున్నామని, ఎక్కడ నిరసనలు లేవని ,వాటిని అణిచివేసే ధోరణి ఉత్పన్నం కాదని ఈ ప్రభుత్వం అటువంటి అణిచివేత పనులు చేయదని తేల్చిచెప్పారు. నల్లబర్లీ పొగాకు ,కోకో ,తోతాపురి మామిడి ,ఉల్లి ధరల విషయాలలో ఆ పంటలకు మద్దతు ధర లేకపోయినా సీఎం చంద్రబాబు నాయుడు చొరవతో వాటిని రాష్ట్ర ప్రభుత్వమే కొనుగోలు చేసిన విషయాన్ని గోవర్ధన్ రెడ్డి గుర్తించాలని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. లిఈ-కేవైసీ పూర్తయిన రైతులకు అన్నదాత సుఖీభవ నగదు జమలి అన్నదాత సుఖీభవ- పీయం కిసాన్ పథకం ద్వారా అర్హత గల ప్రతి రైతు కుటుంబానికి సంవత్సరానికి రూ.20,000/- ఆర్థిక సహాయం అందచేసేందుకు తొలి విడతగా ఇప్పటికే 7 వేల రూపాయలను రైతులకు జమ చేసామని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. అర్హత కలిగి ఉండి కూడా ఈ పథకం లబ్ది పొందని రైతుల కోసం ఆగష్టు 3 వ తేదీ నుండి 20 వ తేదీ వరకు అన్నదాత సుఖీభవ పోర్టల్ లోని గ్రీవెన్స్ మోడ్యూల్ అందుబాటులో ఉంచడం జరిగిందని, సంబంధిత అగ్రికల్చర్ అసిస్టెంట్ లు రైతుల ఫిర్యాదులు పోర్టల్ లో పరిచారని తెలిపారు. ఈ ఫిర్యాదులన్నింటిని అన్నదాత సుఖీభవ మార్గదర్శకాల ప్రకారం అర్హతా ప్రామాణికాలతో రాష్ట్ర స్థాయిలో ధ్రువీకరణ చేయగా 36,722 మంది అర్హులు గా గుర్తించామని తెలిపారు. అర్హులయ్యుండి %వ -ఖ్జ% లేక , రైతుల బ్యాంకు అకౌంట్ కి %చీూజ×ూజు×వూ×ఉచీ% లేని కారణంగా కొంతమంది రైతులకు ఈ పథకం లబ్ది అందలేదని, అలాంటి రైతులలో ప్రస్తుతం %వ-ఖ్జ% చేయించుకున్న వారికి అలాగే %చీూజ× ూజు×వూ×ఉచీ% చేయించుకున్న వారికి, ఫిర్యాదుల ధృవీకరణలో అర్హతపొందిన రైతులతో కలిపి మొత్తం 47,161 మందికి సెప్టెంబర్ 4వ తేదీన మొదటి విడత లబ్ది రూ. 5000/- రూపాయల చొప్పున మొత్తం 23.58 కోట్లు విడుదల చేయడం జరిగిందని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు.

## రేపు ప్రధాని మోదీతో మంత్రి లోకేశ్ భేటీ..

జరగనున్న ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో పాల్గొంటారు.

**జీఎస్టీ చారిత్రాత్మక సంస్కరణలను స్వాగతిస్తున్నాం: మంత్రి లోకేశ్**

జీఎస్టీలో భాగంగా ఇప్పటివరకు ఉన్న నాలుగు శ్లాబులను రెండుకు కుదించడం, నిత్యావసరాలపై పన్ను రేట్లను తగ్గించడం వంటివి వృద్ధికి దోహదపడే సానుకూల నిర్ణయాలని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు. ఈ సంస్కరణలు దేశ పన్నుల విధానాన్ని మరింత సరళతరం చేస్తాయని ఎక్స్ (ట్విట్టర్) వేదికగా ఆయన కొనియాడారు. ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ మంత్రిగా, ముఖ్యంగా పెన్సిళ్లు, షార్ప్‌నర్‌లు, వ్యాయామ పుస్తకాలు (ఎక్సర్‌సైజ్ బుక్స్), మ్యాపులు, చార్టుల వంటి వాటిపై జీఎస్టీ తగ్గించడాన్ని ప్రత్యేకంగా అభినందిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ నిర్ణయం విద్యార్థుల తల్లిదండ్రులకు ఎంతో ఊరటనిస్తుందని అన్నారు. ఇలాంటి చర్యలు విజ్ఞాన ఆధారిత ఆర్థిక వ్యవస్థను ముందుకు నడిపించడానికి ఎంతగానో ఉపయోగపడతాయని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. సరళమైన, వృద్ధికి అనుకూలమైన పన్నుల విధానాన్ని తీసుకొచ్చినందుకు ప్రధాని మోదీని ఆయన ప్రశంసించారు.

## విజయవాడ - బెంగళూరు విమానానికి తప్పిన పెను ప్రమాదం

నుంచి బెంగళూరుకు బయలుదేరిన విమానాన్ని టేకాఫ్ సమయంలో పక్షి ఢీకొనడంతో ప్రయాణికులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. అయితే, పైలట్ సకాలంలో అప్రమత్తమై చాకచక్యంగా వ్యవహరించడంతో 100 మంది ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. వివరాల్లోకి వెళితే, గన్నవరం విమానాశ్రయం నుంచి ఓ విమానం 100 మంది ప్రయాణికులతో బెంగళూరుకు బయలుదేరింది. విమానం రన్‌వేపై నుంచి గాల్లోకి లేస్తున్న సమయంలో ఓ పక్షి వేగంగా వచ్చి విమానం రెక్కను బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనతో విమానం రెక్క భాగం స్వల్పంగా దెబ్బతిన్నట్లు సిబ్బంది గుర్తించారు. ప్రమాదాన్ని వెంటనే పసిగట్టిన పైలట్ ఏ మాత్రం ఆలస్యం చేయకుండా విమానాన్ని తిరిగి గన్నవరం ఎయిర్‌పోర్ట్‌లోనే అత్యవసరంగా ల్యాండింగ్ చేశారు. విమానం సురక్షితంగా నేలకు దిగడంతో ప్రయాణికులతో పాటు, విమాన సిబ్బంది కూడా ఊపిరి పీల్చుకున్నారు. అనంతరం ప్రయాణికులందరినీ కిందకు దించివేసి, సాంకేతిక నిపుణులు విమానానికి మరమ్మతులు చేపట్టారు. సుమారు గంట వ్యవధిలోనే రెక్కకు జరిగిన నష్టాన్ని సరిదిద్ది, విమానం ప్రయాణానికి సురక్షితమని నిర్ధారించారు. ఆ తర్వాత అదే విమానంలో ప్రయాణికులను తమ గమ్యస్థానానికి పంపించారు. సరైన సమయంలో పైలట్ అప్రమత్తంగా వ్యవహరించడం వల్లే పెను ప్రమాదం తప్పిందని అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

# వైభవంగా గణేష్ నిమజ్జనాలు



**ఎటపాక, సెప్టెంబర్ 4 (తెలుగు రాష్ట్రం విలేఖరి):** మండల పరిధిలో గురువారం గణేష్ నిమజ్జనాలు వైభవంగా జరిగాయి. గన్నేరు కొయ్యపాడు గ్రామంలో అంబేద్కర్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి నిమజ్జనానికి ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా వసంతాల బ్రదర్స్ సహకారంతో యువకులకు చిన్నారులకు ఇచ్చిన టీ షర్టు వై ఎస్ ఆర్ సి పి మండల అధ్యక్షులు ఆకుల వెంకట రామారావు చేతుల మీదుగా అందజేశారు. అనంతరం మేళ తాళాలు , డాన్సులతో గణనాథుడిని ఊరేగించారు. ఆ తరువాత పవిత్ర గోదావరి నదిలో వినాయకుడిని భక్తిశ్రద్ధలతో నిమజ్జనం చేశారు.

# ఉపాధి హామీ నిధులతో ప్రహరీ గోడ నిర్మాణం

## -ప్రాజెక్టు అధికారి కట్ట సింహాచలం



**రంపచోడవరం, సెప్టెంబర్ 4 (తెలుగురాష్ట్రం ప్రతినిధి):** రంపచోడవరం ప్రభుత్వ హైస్కూల్, జూనియర్ కళాశాలకు ఉపాధి హామీ పథకం నిధులతో ప్రహరి గోడ నిర్మించడం జరుగుతుందని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి కట్టా సింహాచలం పేర్కొన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ హైస్కూల్, జూనియర్ కళాశాల ప్రాంగణంలో ప్రహరీ గోడ పనులకు ప్రాజెక్ట్ అధికారి కొబ్బరికాయ కొట్టి భూమి పూజ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక ప్రభుత్వ హైస్కూల్ కు, జూనియర్ కళాశాల ప్రాంగణంలో సుమారు 350 మీటర్లకు ప్రహరి గోడ నిర్మాణానికి 25 లక్షల రూపాయల వ్యాయంతో ఉపాధి హామీ పథకం నిధులతో ఈ ప్రహరి గోడ నిర్మించడం జరుగుతుందని ఆయన అన్నారు.ఈ ప్రహరీ గోడ క్వాలిటీతో త్వరితగతిన పనులు ప్రారంభించి పనులు పూర్తి చేయాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బంధం శ్రీదేవి,జెడ్పిటిసి సభ్యురాలు పండ వెంకటలక్ష్మి,ఎంపిటీసీ కుంజం వంశీ, ప్రభుత్వ హైస్కూల్ చైర్మన్ దుమంతు సుందర్ సింగ్,తాసిల్దార్ బాలాజీ, డిప్యూటీ ఎంపీడీవో వై. రాజబాబు, డిప్యూటీ ఇంజనీర్ భవాని,ఎఈ. ప్రదీప్,జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కె. కృష్ణ, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు,పద్మావతి, పురోహితులు అద్దంకి వెంకటేశ్వరరావు,శశాంక్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

# రహదారుల అభివృద్ధికి నిధులు కేటాయించాలని వినతి



**చింతలపూడి, సెప్టెంబర్ 4 (తెలుగురాష్ట్రం విలేఖరి):** రాష్ట్ర సచివాలయంలో రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డిని గురువారం చింతలపూడి ఎమ్మెల్యే రోషన్ కుమార్ కలుసుకొని చింతలపూడిలో ఉన్న రహదారులు దుస్థితిని వివరించారు. ఇటీవలన కలిసిన భారీ వర్షాలు దెబ్బతిన్న రహదారుల ఛాయాచిత్రాలను సహితం మంత్రికి ఎమ్మెల్యే చూపించారు.దాంతో మంత్రి జనార్దన్ రెడ్డి స్పందించి నిధుల కేటాయింపులో ప్రత్యేక ప్రాధాన్యత కల్పిస్తామని మంత్రి హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

# మంచినీటి సమస్యను పరిష్కరించిన పంచాయతీ సిబ్బంది



**ఎటపాక, సెప్టెంబర్ 4 (తెలుగురాష్ట్రం విలేఖరి):** ఎటపాక గ్రామంలోని ఎస్సీ కాలనీ ప్రజలకు మంచినీరు అందించే, మోటర్ కాలిపోవడం వల్ల మంచినీళ్లు రాక గత నాలుగు రోజులుగా ప్రజలు అనేక ఇబ్బందులు పడుతుంటే గమనించిన ఎస్సీ కాలనీ యూత్ గజ్జల శ్రీనివాస్, బత్తుల మహేష్, గుమ్మడి నరసింహారావు,పెద్దలు దేగల మాధవరావు తదితరులు గ్రామపంచాయతీ సెక్రటరీ శ్రీమతి పద్మావతి దృష్టికి తీసుకెళ్లగా వెంటనే స్పందించిన చెడిపోయిన మోటార్ కి మరమ్మత్తులు చేయించి ప్రజలందరికీ మంచినీటి సమస్యను పరిష్కరించారు. ఈ సందర్భంగా సెక్రటరీ, పంచాయతీ సిబ్బందికి ఎస్సీ కాలనీ ప్రజలు ధన్యవాదాలు తెలియజేశారు. భవిష్యత్తులో కూడా మా కాలనీలో ఉన్న సమస్యలను డ్రైనేజీ, వీధిలైట్లు శానిటేషన్ బ్లీచింగ్ ఫాగింగ్ తదితర సమస్యలు పరిష్కరించేందుకు తమరు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. గ్రామంలో ఉన్న సమస్యలను ప్రజలందరినీ అడిగి, తెలుసుకుని ఎప్పటికప్పుడు వాటి పరిష్కారానికి కృషి చేస్తున్న ఎటపాక యూత్ గజ్జల శ్రీనివాస్ భక్తుల మహేష్ గుమ్మడి నరసింహారావు పెద్దలు,దేగల మాధవరావు తదితరులను ప్రజలు అభినందించారు.

## లంబోదర ఫ్రెండ్ సర్కిల్ వారిచే

# భారీ అన్న సమారాధన



**తాడేపల్లిగూడెం, సెప్టెంబర్4(తెలుగురాష్ట్రం ప్రతినిధి):** లంబోదరుడు విజ్ఞానానికి తెలివితేటలకు అధిపతి అని ఆయనను విశ్వసించడం పట్ల సమస్త జ్ఞానాన్ని ప్రసాదిస్తారని పెంటపాడు వైయస్సార్సీపి గ్రామ కమిటీ అధ్యక్షులు,7వ వార్డు సభ్యుడు బర్ల జయ రాంబాబు అన్నారు. వినాయక చవితి ఉత్సవాలలో భాగంగా గురువారం పెంటపాడు గ్రామం కొబ్బరితోట లోని వీరబ్రహ్మం గుడి వద్ద 7వ వార్డు సభ్యుడు బర్ల జయ రాంబాబు ఆధ్వర్యంలో లంబోదర ఫ్రెండ్స్ సర్కిల్ వారిచే భారీ అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భారీ ఎత్తున భక్తులు పాల్గొని గణనాధుని ఆశీస్సులను అందుకుని అన్న ప్రసాదాలను స్వీకరించారు. ఈ సందర్భంగా వైకాపా గ్రామ కమిటీ అధ్యక్షుడు జయ రాంబాబు మాట్లాడుతూ సమస్త విశ్వాన్ని తనలో ఇమ్ముడుచుకున్న లంబోదరుని ఆశీస్సులు గ్రామ ప్రజలందరిపై ఎల్లవేళలా ఉండాలని, ఎటువంటి కష్టాలనైనా, కఠినమైన పరిస్థితులైన తట్టుకోగల శక్తిని ప్రసాదించే దేవుడు ఆ గణేశుడు అన్నారు. అటువంటి గణేశుడు ని భక్తిశ్రద్ధలతో పూజించడం వల్ల ఆయన మన కోరికలన్నీ తీర్చుతాడని అన్నారు. ఇంతటి భారీ అన్న సమారాధనను ఘనంగా నిర్వహించిన లంబోదర ఫ్రెండ్స్ సర్కిల్ కమిటీ వారిని ఆయన అభినందించారు. ఈ భారీ అన్న సమారాధనలో సుమారు 4500 మంది భక్తులు పాల్గొని అన్నప్రసాదాలను స్వీకరించారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు రెడ్డి సూరిబాబు, ప్రచార కమిటీ కార్యదర్శి బండారు రాంబాబు, ఉండ్రాజవరపు రాజు, రెడ్డి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# ఆ... రోడ్డు ఒక్కటే మార్గం మరో మార్గం లేక తప్పని కష్టాలు



**వి ఆర్ పురం, సెప్టెంబర్ 4 (తెలుగురాష్ట్రం విలేఖరి):** మండలంలోని పర్యాటకలు పాపికొండల పర్యటనకు వెళ్లాలన్న, రావాలన్న, మారుమూల కొండప్రాంతాల్లో నివసిస్తున్న ములకపల్లి, కోటారుగొమ్ము, ఇప్పురూ, పోచవరం, కొల్లూరు, గోందూరు నాటు పడవ లపై ప్రయాణం చేసే గ్రామాల గిరిజనులు సైతం మండల కేంద్రమునకు రాకపోకలు కొనసాగించాలన్న ఆ... రోడ్డు ఒక్కటే మార్గం. అలాంటిది ఇప్పుడు రెండు తెలుగు రాష్టాలలో ఎడతెరిపి లేని భారీ వర్షాలు కురవటం తో ఆ ప్రాంతాలలో వరదలు సంభవించటంతో గ్రామాలలో ఉన్నా చూట్టు ప్రక్కల రోడ్డు మార్గాలు వరద నీటితో కొట్టుకొని పోయి, గుంతలు – గుంతలుగా ఏర్పాడి మరింత అధ్వానంగా తయారయ్యాయి. దీని వలన మండలం లోని మారుమూల ప్రాంతాలలో నివాసించే కొండ గిరిజనులు, నిత్యావసరల నిమిత్తం, విద్య, వైద్యం నిమిత్తం రోజు మండలం కేంద్రం అయిన వి ఆర్ పురం గ్రామం రావలసిన అవసరం ఎంతైనా ఉందని ఆ మార్గం అధ్వానంగా తయారవడంతో గిరిజన ప్రజలు ఆ మార్గం గుండా ప్రయాణం చేయాలంటే భయాందోళన చెందుతున్నారు. అదే మార్గం గుండా రోజు ప్రయాణం చేసే ఆటో, మ్యాజిక్ వాహనదారులు కూడా భయాందోళన చెందుతూ, తప్పక ప్రయాణం చేస్తున్నారు. అధికారులు ఈ విషయం గమనించి, దృష్టిసారించి, ఉన్నత అధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకొని వెళ్లి సమస్యను పరిష్కరించాలని మారుమూల గిరిజన ప్రజలు కోరుతున్నారు.

# కుల రక్కసిని రగిలిస్తే ఊరుకోను...

## ఎమ్మెల్యే ఆనందరావు హేచ్చరిక



**అమలాపురం : సెప్టెంబర్ 05(తెలుగురాష్ట్రం ప్రతినిధి)** ప్రశాంత డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కోనసీమ లో కుల రక్కసిని రాజేస్తున్నారు. అన్ని వర్గాలు నన్ను ఎన్నుకున్నారు. కూటమి ప్రభుత్వం లో అరాచక శక్తులను ఊపిక్షించం అంటూ ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అన్నారు. రాష్ట్ర టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు స్వగృహంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో మాట్లాడారు. సోషల్ మీడియా లో ఏ కులం వారు కవ్వింపు చర్యలకు పాల్పడినా వారిపై చర్యలు తప్పవని ఎమ్మెల్యే ఆనందరావు హెచ్చరించారు. పోలీస్ కు తగిన సూచనలు చేస్తున్నానని వారు అటువంటి వారిని కట్టడి చేయడానికి తనవంతు సహకారం చేస్తానని ఎమ్మెల్యే అన్నారు. సంఘ విద్రోహ శక్తులపై ఉక్కుపాదం మోపాలని మెట్ల రమణబాబు అన్నారు. ఫ్లెక్సీ ప్రింటింగ్ యజమానులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని రమణబాబు అన్నారు.ఈ సమావేశంలో నల్లా స్వామి, పట్టణ అధ్యక్షులు తిక్కిరెడ్డి నేతాజీ, కౌన్సిలర్ అబ్బిరెడ్డి చంటి, బొర్రా ఈశ్వరరావు, ఆశెట్టి ఆది బాబు, చింతలపూడి సత్తిబాబు, బోనం సత్తిబాబు పెద్దిరెడ్డి నాయుడు, గంధం శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా వినాయక నిమజ్జనం



**పోలవరం, సెప్టెంబర్ 4 (తెలుగురాష్ట్రం ప్రతినిధి):** నియోజకవర్గ పరిధిలో వినాయక చవితి వేడుకలు వైభవంగా ముగిశాయి. గురువారం వినాయకుడి విగ్రహాలను పూలమాలతో అలంకరించి భక్తిశ్రద్ధలతో మహిళలు ట్రాక్టర్ మీద వినాయక చవితి తొమ్మిదవ రోజు అయిన సందర్భంగా పోలవరం నుండి పట్టిసీమ వరకు పిల్లలు పెద్దలు అందరూ కలిపి భారీ ఊరేగింపుగా పట్టిసీమలో నిమజ్జనం కోసం తరలించారు. డీజే సౌండ్, తీన్మార్ వాయిద్యాల మధ్య భక్తులు ఎంతో ఉత్సాహంగా, నృత్యాలతో పాల్గొన్నారు. పూలతో అలంకరించిన గణేష్ విగ్రహాలను భక్తి శ్రద్ధలతో ఊరేగింపుగా తీసుకెళ్తూ, గణపతి పప్పా మోరియా అంటూ శ్లోకాను తెలియజేస్తూ మార్గమధ్యంలో భక్తులకు ప్రసాదాలు పంచుతూ పండుగ వాతావరణాన్ని మరింత పెంచారు.

# కేంద్ర మంత్రితో సియా ఫిల్లింగ్ స్టేషన్ ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే బాలరాజు



**పోలవరం, సెప్టెంబర్ 4 (తెలుగురాష్ట్రం ప్రతినిధి):** కొయ్యలగూడెం మండలం పొంగుటూరు గ్రామంలో సియా ఫిల్లింగ్ స్టేషన్‌ను గురువారం ఘనంగా ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ తో కలిసి ఎమ్మెల్యే శాసనసభ్యులు చిర్రి బాలరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి దిశగా ఇలాంటి సౌకర్యాలు ఏర్పడడం సంతోషకరమని తెలిపారు. ప్రజలకు మరింత సౌకర్యం కలిగేలా కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. కార్యక్రమంలో మాజీ డిసిసిబి చైర్మన్ కరాటం రాంబాబు, జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి కరాటం సాయి, జనసేన మండల అధ్యక్షుడు తోట రవి, పట్టణ అధ్యక్షుడు మాదేపల్లి శ్రీనివాస్, బిజెపి జిల్లా అధ్యక్షులు విక్రమ కిషోర్, పార్లమెంట్ ఇంచార్జ్ కృష్ణ ప్రసాద్, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు నిర్మల కిషోర్, మండల బిజెపి అధ్యక్షుడు గోలిశెట్టి శ్రీనివాస్ తదితర కోటమి నాయకులు పాల్గొన్నారు.

# దాసరి అబ్బులుకు అభినందనలు

**ఏలూరు, సెప్టెంబర్ 4(తెలుగు రాష్ట్రం విలేకరి):** బహుజన సేన ఏలూరు జిల్లా వైస్ ప్రెసిడెంట్ గా నియమితులైనందుకు దాసరి అబ్బులు పలువురు అభినందించారు. ఈ సందర్భంగా బహుజనసేన వ్యవస్థాపకులు మత్తెబాబి మాట్లాడుతూ బహుజన సేన ఎంతో మందికి సహాయ సహకారాలు అందించడమే కాక పలువురి మన్ననలు పొందుతూ అందరి చేత ప్రశంసలు పొందుతుందని అనేక మందికి సహాయ సహకారాలు అందిస్తూ వారి సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తుందన్నారు.



# చింతూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆవిష్కాంధ్ర ప్రతిజ్ఞ



**చింతూరు, సెప్టెంబర్ 4 (తెలుగు రాష్ట్రం విలేకరి):** స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆవిష్కాంధ్ర ప్రతిజ్ఞ నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా. కె. రత్న మాణిక్యం తెలియజేశారు. కళాశాల ప్రిన్సిపల్ మాట్లాడుతూ ప్రతి ఇంటిలో యువత కొత్త కొత్త ఇన్నోవేషన్స్ స్థాపించే దిశగా ఎదగాలని నూతన ఆవిష్కరణలు చేయవలసిన స్థాయికి ఎదగాలనన్నారు. స్వాలంబన, సుస్థిరత, సమగ్రతతో కూడిన ఆంధ్రప్రదేశ్ నిర్మాణానికి కృషి చేస్తూ భారతదేశ అభివృద్ధి, ప్రపంచ నాయకత్వానికి తోడ్పడాలన్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ముల్లి శేఖర్ విద్యార్థుల ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతి ఆలోచనలోనూ, ప్రతి వ్యాపారంలోనూ, నైతిక విలువలు, నిజాయితీ, బాధ్యతను పాటించాలని, సమాజ సమస్యలకు పరిష్కారాలు చూపే సృజనకర్తలుగా, ధైర్యంగా ముందుకు సాగాలన్నారు. ఈ ప్రతిజ్ఞలో రేపటి ఆవిష్కర్తలుగా, నాయకులుగా, మార్పు సృష్టికర్తలుగా ఎదుగుతామని విద్యార్థులందరూ ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు ఎస్.అపనమ్మ, కె. శకుంతల, జి.హారతి, కె.శైలజ, ఎమ్.నాగ మోహన్ రావు, మౌనిక, సాయికుమార్, శ్రీనివాసరావు, పి. మోనిక, ఎన్.ఆనంద్, అధ్యాపకేతర బృందం విద్యార్థినీ, విద్యార్థులు ప్రతిజ్ఞలో పాల్గొన్నారు.

https://epaper.teluguraastram.com

తెలుగురాష్ట్రం దినపత్రిక

# ఏజెన్సీ ప్రాంత ఉపాధ్యాయ పోస్టులను స్థానిక అభ్యర్థులతోనే భర్తీ చేయాలి

**-రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కనితి శేఖర్**



**కూనవరం, సెప్టెంబర్ 4 (తెలుగురాష్ట్రం విలేకరి):** ఏటిఏ అత్యవసర సమావేశం ఎటపాక మండలంలో మండల అధ్యక్షులు కాక రాజు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కనితి శేఖర్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూమెగా డీఎస్సీ 2025లో ఏజెన్సీ ప్రాంతంలో ఖాళీగా ఉన్న పోస్టులను స్థానిక ఆదివాసులతోనే భర్తీ చేయాలి లేని పక్షాన ఆదివాసీలు తీవ్ర అన్యాయానికి గురవుతారని అన్నారు. ప్రస్తుత ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు నాయుడు ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు జీవో నెంబర్ మూడును పునరుద్ధరించి ఏజెన్సీ ప్రాంత ఉద్యోగాలను స్థానిక ఆదివాసీలకే కేటయిస్తానని ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు ఆనాడు పాడేరు సభలో మాట్లాడటం జరిగిందని ప్రస్తుతం ముఖ్యమంత్రిగా ఉన్నారు. కాబట్టి ఏజెన్సీ ప్రాంత ఉపాధ్యాయ ఖాళీల విషయమై ప్రత్యేక ఏజెన్సీ ఉద్యోగ నియామక చట్టం చేసి స్థానిక ఆదివాసి అభ్యర్థులతోనే ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని అన్నారు. రాజ్యాంగం ఏజెన్సీ ప్రాంతాలకు కొన్ని ప్రత్యేక చట్టాలను కల్పించడం జరిగింది. వాటిని పకడ్బందీగా అమలు చేయవలసిన బాధ్యత ప్రభుత్వం- ప్రభుత్వ అధికారుల పైన ఉందన్నారు అలా కాకుండా ఫిఫ్త్ షెడ్యూల్ ప్రాంతంలో గిరిజనేతరులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం వలన ప్రభుత్వమే వలసలను ఏజెన్సీ ప్రాంతాలకు ప్రోత్సహించినట్లు అవుతుందన్నారు ఇది రాజ్యాంగ చట్టాలకు విరుద్ధం అన్నారు.ఏజెన్సీ ప్రాంత యువతి యువకులు ఉద్యోగ ఉపాధి లేక నిరాశ నిస్పృహలో ఉన్నారు స్థానిక ఉద్యోగాలను వారికి కేటాయించకుండా మైదాన ప్రాంతం వారికి కేటాయించినట్లయితే ఏజెన్సీ ప్రాంత యువత ఉధ్యోగ ఉపాది లేక రాజ్యాంగేతర శక్తులుగా మారే ప్రమాదం ఉందన్నారు ఆ దిశగా యువత వెళ్లకుండా ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న అనేక ఉద్యోగ ఉపాధి అవకాశాలను రాజ్యాంగ చట్టాలకు లోబడి స్థానిక అభ్యర్థుల తోనే భర్తీ చేయాలన్నారు. ప్రస్తుత మెగా డియస్సీ-2025 ఏజెన్సీ ఉపాధ్యాయ కాళీలను స్థానిక ఆదివాసీలతోనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర నాయకులు పూసం శ్రీను, జిల్లా ప్రధనకార్యదర్షి కనితి రామకృష్ణ, కాకా శివశంకర్, పోడియం రామకృష్ణ, అపక నాగేశ్వరరావు, కట్టం వెంకటేశ్వర్లు, పూరి కిరణ్ కుమార్, పాయం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు

# యూరియా కొరతపై నిరసన కార్యక్రమం విజయవంతం చేద్దాం



**జంగారెడ్డిగూడెం, సెప్టెంబర్ 4 (తెలుగురాష్ట్రం విలేఖరి):** రైతులకు యూరియా కొరతపై నియోజకవర్గ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సమావేశం వైసీపీ నాయకులు జెట్టి గురునాథరావు కార్యాలయం వద్ద చింతలపూడి నియోజకవర్గ ఇన్చార్జ్ కంభం విజయరాజు అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిలుగా మచిలీపట్నం పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకులు జెట్టి గురునాథరావు, జిల్లా ఉపాధ్యక్షురాలు, చింతలపూడి మాజీ మార్కెట్ కమిటీ చైర్పర్సన్ జగ్గవరపు జానకి రెడ్డి, జిల్లా మహిళా అధ్యక్షురాలు కేసర సరిత రెడ్డి, జిల్లా మున్సిపల్ విభాగం అధ్యక్షులు బొడ్డు వెంకటేశ్వరరావు, జిల్లా ప్రచార విభాగం అధ్యక్షులు త్సల్లా బత్తుల శ్రీనివాసరావు, పార్టీ మండల అధ్యక్షులు ఓరుగంటి నాగేంద్ర కుమార్, రమేష్ రెడ్డి, అన్నపునేని శాంతారావు, రాయాంకుల సత్యనారాయణ, కర్పూరం గుప్త, వివిధ మండలాల నుండి రాష్ట్ర, జిల్లా, మండల ముఖ్య నాయకులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి నియోజకవర్గ ఇన్చార్జ్ కంభం విజయరాజు మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు వైయస్ జగన్మోహన్ రెడ్డి పిలుపు మేరకు ఈ నెల 9న రాష్ట్రవ్యాప్తంగా రైతులకు యూరియా అందకపోవటం బట్టి రాష్ట్రవ్యాప్తంగా ఆర్డిఓ కార్యాలయాలు వద్ద రైతుల కొరకు యూరియా కొరకు రైతు నిరసన కార్యక్రమాన్ని చేపట్టమని పిలుపునిచ్చారు. కావున చింతలపూడి నియోజకవర్గంలో జంగారెడ్డిగూడెం ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం విజవంతం చెయ్యాలని నియోజకవర్గ పరిధిలో గల రైతులు మరియు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున ఈ నిరసన కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. పాత బస్టాండ్ వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఉదయం 10:30 గంటలకు పాత బస్టాండ్ నుండి జంగారెడ్డిగూడెం ఆర్డీవో కార్యాలయం వరకు కాలినడక ప్రదర్శన చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నియోజవర్గ రైతు విభాగం అధ్యక్షులు ఖాదర్ బాబు రెడ్డి చండీప్రియ, జంగారెడ్డిగూడెం మండలం పరిధిలో మాజీ జెడ్పిటిసి సభ్యులు ముప్పిడి శ్రీనివాసరావు రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి గురజాల పార్థసారథి, కుక్కల ధర్మరాజు, మల్టీడి బాబి, జెట్టి సత్య ఆదిత్య, బత్తిన చిన్న, తనికెళ్ళ ప్రసాద్, కొయ్యే లీలాధర్ రెడ్డి,గంజి వినోద్, నీకూరి కిషోర్, ఇళ్ల శ్రీనివాస్ రెడ్డి, కొప్పుల రవిచంద్ర రెడ్డి, కురు రవి, మహమ్మద్ షరీఫ్, షేక్ అక్బర్ వీరవెల్లి సోమేశ్వరరావు, చెప్పాడా వెంకన్న, చిత్తపురి శేఖర్, చదలవాడ రామకృష్ణ ఐజి తాడేపల్లి ఉమాదేవి భాషకామవరపు మండలం ఉప్పలపాటి శ్రీనివాసరావు, ఉప్పలపాడు మోహన్ రావు, దేవరపల్లి రామ్మోహన్రావు, గుర్రాల రవి, బూరుగు శ్రీను, నానాజీ సాగర్, కనుమూరి ప్రసాద్ రెడ్డి, షేక్ వీరవల్లి, కొమ్మున నరేష్, అన్నపురెడ్డి ఎల్లారావు, పెనుగొండ శివ ఉమా, లింగపాలెం మండలం రవి, కొండయ్య, శ్రీను, పెద్దంగ శ్రీను, చీరాల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# టిడిపి హయాంలోనే నియోజకవర్గ అభివృద్ధి

**-అవుట్ ఫాల్ డ్రైన్ శంకుస్థాపనలో కార్యక్రమంలో ఎమ్మెల్యే వాసు**



**రాజమహేంద్రవరం, సెప్టెంబరు 4 (తెలుగురాష్ట్రం ప్రతినిధి) :** నియోజకవర్గ పరిధిలో ఎటువంటి అభివృద్ధి జరిగినా అది తెలుగుదేశం ఘనతేనని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) అన్నారు. స్థానిక 49వ డివిజన్ సింహాచలం నగర్లో 32 లక్షల 50వేల రూపాయలతో చేపట్టిన అవుట్ ఫాల్ డ్రైన్ అభివృద్ధి పనులకు శంఖుస్థాపన చేసారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వాసు మాట్లాడుతూ ఈ ప్రాంతంలో రోడ్లు కానీ, డ్రైన్లు గానీ, కరెంట్ స్తంభాలు గానీ ఏద్కెనా సరే తెలుగుదేశం హయాంలో జరిగాయన్నారు. వర్షానికి ఎగువనుంచి వచ్చే నీరు క్వారీ గోతుల్లో చేరి, మరింత దుర్గంధంగా మారుతోందన్నారు. ఈ డ్రైన్ నిర్మిస్తే, నీరు నిలిచిపోవడం, క్వారీ గోతుల్లోకి వెళ్లడం ఉండదని అన్నారు. అందుకే శంకుస్థాపన చేశామన్నారు. అంతేకాకుండా ఇక్కడే కట్టిన టిడ్కో ఇళ్ళు అసంపూర్తిగా ఉన్నాయని ఎమ్మెల్యే వాసు ప్రస్తావించారు. మళ్ళీ కాంట్రాక్టర్తో మాట్లాడి బయట ఫ్లోరింగ్ ప్లాస్టింగ్ చేయిస్తున్నామని అన్నారు. అదేవిధంగా టిడ్కో ఇళ్ళకు డ్రైనేజి వాటర్ వెళ్లిపోవడానికి మార్గం లేకుండా చేసారని అక్కడ మరో 30లక్షలతో వాటర్ బయటకు వెళ్లేలా ఒక డ్రైన్ కట్టిస్తున్నట్లు చెప్పారు. గత ప్రభుత్వంలో డబ్బులున్నాయని, అనవసరంగా వెచ్చించారే తప్ప, ప్రజలకు అవసరమైన రీతిలో ఖర్చు చేయలేదని ఇలాంటి పనుల వలన గత ప్రభుత్వ నిర్వాకం తెలుస్తోందని అన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రజలకు అవసరమైన విధంగా పనులు చేస్తున్నామని, ప్రజలు కూడా గమనిస్తున్నారని అన్నారు. డివిజన్ నాయకులు దుత్తరపు గంగాధర్ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు కాశీ నవీన్ కుమార్, రాచపల్లి ప్రసాద్, మొకమాటి సత్యనారాయణ, నేమాలి శ్రీను, తురకల నిర్మల, అగురు ధనరాజ్, కేబుల్ మురళి, మళ్ల వెంకట రాజు, సలాది ఆనంద్, సందక లక్ష్మణరావు, గుదే రఘునరేష్, బేసరి చిన్ని, కానేటి ప్రభు, అజ్జరపు రమేష్, మేడికొండ అప్పారావు, కవులూరి, వానపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# మ్యాజిక్ డ్రైన్ల పనులను ప్రారంభించిన ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్



**తాడేపల్లిగూడెం, సెప్టెంబర్ 4 (తెలుగురాష్ట్రం విలేఖరి):** మురుగులేని పల్లెలు నిర్మించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం అని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. తాడేపల్లిగూడెం మండలంలో పెద్ద తాడేపల్లి, చిన్న తాడేపల్లి, వెంకట్రావు పాలెం, అప్పారావుపేట అమృతపురం, లింగారాయుడు గూడెం, ఆరుగొలను, కుంచనపల్లి, గ్రామాల్లో మురుగు నీటి సమస్య పరిష్కరించే మ్యాజిక్ డ్రైన్ల పనులను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయనతోపాటు జిల్లా పరిషత్ చైర్మన్ గంటా పద్మశ్రీ పాల్గొన్నారు. పల్లెలను పర్యాటక ప్రాంతాల మాదిరి సుందరంగా తీర్చిదిద్దడమే కూటమి ముందున్న ధ్యేయమని ఆ దిశగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ల సహకారంతో నియోజక అభివృద్ధికి కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. తాడేపల్లిగూడెం నియోజకవర్గం లో గతంలో నేను పాదయాత్ర చేసినప్పుడు నాతోపాటు అడుగులో అడుగు వేసినటువంటి గ్రామ ప్రజలు రోడ్లు సరిగా లేకపోవడం, రోడ్లమీద మరుగు నీరు నిలిచిపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు నాకు చెప్పడం జరిగింది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టుకుంటూ దానిలో భాగంగా మురుగు లేని పల్లెలుగా మన తాడేపల్లిగూడెం నియోజకవర్గాన్ని తీర్చిదిద్దాలని. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి, పవన్ కళ్యాణ్, మంత్రి లోకేష్, తక్కువ ఖర్చుతో కూడిన మ్యాజిక్ డ్రైన్ లను మొట్టమొదటిసారిగా ఈ తాడేపల్లిగూడెం నియోజకవర్గం లో ప్రారంభించడం జరిగింది. ఒకప్పుడు డ్రైనేజీలు నిర్మించాలంటే ఎక్కువ ఖర్చుతో కట్టాల్సి వచ్చేది గ్రామాల్లో ఎన్ ఆర్ జి ఎస్ నిధులతో మ్యాజిక్ డ్రైన్లను తక్కువ ఖర్చుతో కట్టడానికి మన కూటమి ప్రభుత్వం కల్పించడం జరిగిందన్నారు. జిల్లా పరిషత్ చైర్మన్ గంటా పద్మశ్రీ మాట్లాడుతూ తాడేపల్లిగూడెం నియోజకవర్గం లో జడ్పి నిధుల నుంచి కూడా డ్రైనేజీలను కట్టడం జరుగుతుంది. ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ మన జడ్పీ నుంచి కూడా ఆయన గ్రాంట్లు తెచ్చుకొని ఈ సంవత్సరకాలంలోనే ఎన్నో అభివృద్ధి పనులు చేయడం జరిగింది. ఎమ్మెల్యే తాడేపల్లిగూడెం నియోజకవర్గ అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. అదే విధంగా ప్రజలు కూడా ఆయనకి సహకరిస్తున్నారు అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అడపా ప్రసాద్, పరిమి రవికుమార్, పుల్లా బాబి, పరిమి సురేష్, పసుమర్తి సత్యనారాయణ, గోవిందు, పీతల బుచ్చిబాబు, పిల్లా రాంబాబు, వాడపల్లి సుబ్బరాజు, అధికారులతో పాటు కూటమి సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# తాటియాకులగూడెంలో ఘనంగా వినాయక ఉత్సవాలు




**జీలుగుమిల్లి, సెప్టెంబర్ 4 (తెలుగురాష్ట్రం విలేఖరి):** తాటియాకులగూడెం ట్యాంక్ బజారులో శ్రీ శ్రీ వరసిద్ధి వినాయక యూత్ ఆధ్వర్యంలో వినాయక ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలు తొమ్మిది రోజుల పాటు కన్నులపండువగా జరిగాయి.ఉత్సవాల్లో భాగంగా ఎనిమిదవ రోజు అన్నసంతర్పణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన లడ్డు వేలంలో ఫ్రెండ్స్ యూత్ వారు రూ. 31,000 రూపాయలకు లడ్డును దక్కించుకున్నారు. తొమ్మిదవ రోజు వినాయకుని నిమజ్జన ఊరేగింపును వైభవంగా చేపట్టారు. ఈ ఊరేగింపులో యువకులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తి శ్రద్ధలతో నిమజ్జనం చేశారు. ఈ వేడుకలు గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణాన్ని నింపాయి.

# అడ్వకేట్స్ ప్రొటెక్షన్ యాక్ట్ అమలు చేయాలంటూ న్యాయవాదుల నిరసన



**ఏలూరు సెప్టెంబరు 4 (తెలుగురాష్ట్రం ప్రతినిధి) :** న్యాయవాదులపై దాడులు పెరుగుతున్న తరుణంలో అధ్వకేట్స్ ప్రొటెక్షన్ యాక్ట్ ను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ స్థానిక న్యాయవాదులు ఆందోళన చేపట్టారు. పట్టణ న్యాయస్థానం ప్రాంగణంలో న్యాయవాదులు కండువాలు ధరించి, నినాదాలు చేస్తూ ప్రభుత్వాన్ని ఉద్దేశించి తమ ఆవేదన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా న్యాయవాద సంఘం అధ్యక్షుడు జి.ఎస్.ఆర్. మూర్తి మాట్లాడుతూ,"న్యాయవాదులు సమాజానికి న్యాయం అందించే వారే. వారిపై దాడులు జరగడం చాలా విచారకరం. అందుకే అధ్వకేట్స్ ప్రొటెక్షన్ యాక్ట్ తక్షణం అమల్లోకి రావాలి" అని తెలిపారు.ఆందోళనలో పలువురు న్యాయవాదులు, న్యాయవాద మహిళలు పాల్గొన్నారు.

# శాశ్వత కోర్టు బిల్డింగ్స్ కోసం వినతి పత్రం..!



**కొయ్యలగూడెం సెప్టెంబర్ 4(తెలుగురాష్ట్రం ప్రతినిధి) :** ఈరోజు ఏలూరు జిల్లా కొయ్యలగూడెం మండలంలో పర్యటించిన కేంద్ర ఉక్కు మరియు భారీ పరిశ్రమల శాఖ మంత్రివర్యులు శ్రీ భూపతి రాజు శ్రీనివాస వర్మ నీ కలిసి జంగారెడ్డిగూడెం కోర్టు బిల్డింగ్స్ నిర్మాణం కోసం మెమోరాండం సమర్పించడం అయినది బార్ అసోసియేషన్ అధ్యక్షులు జి.ఎస్.ఆర్ మూర్తి అధ్యక్షతన ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ వాడేపల్లి నాగులు, సీనియర్ న్యాయవాది సాయి ప్రతాప్, కే నరసింహ, సర్వేష్ ఓగిరాల, హరి, కొల్లూరి సతీష్ పాల్గొన్నారు.

# ఎన్ని ఆటంకాలెదురైనా అనుకున్న స్థాయిలో కూటమి ప్రభుత్వ సుపరిపాలన అందిస్తుంది

**ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి**



**ఏలూరు, సెప్టెంబర్ - 4. తెలుగు రాష్ట్రం ప్రతినిధి,** ఎన్ని ఆటంకాలెదురైనా అనుకున్న స్థాయిలో అభివృద్ధిని శరవేగంగా పరుగులు పెట్టించే దిశగా కూటమి ప్రభుత్వ సుపరిపాలన కొనసాగుతోందనీ ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి స్పష్టం చేశారు. ఏలూరులోని తన క్యాంపు కార్యాలయంలో గురువారం ప్రజలకు అందుబాటులో ఉన్న ఆయన,,, తనను కలిసేందుకు వచ్చిన వారిని ఆప్యాయంగా పలకరించారు. వారి సమస్యలను క్షుణ్ణంగా తెలుసుకునీ, నేనున్నానంటూ వారికి భరోసా కల్పించీ, అండగా ఉంటానని ధైర్యం చెప్పారు. అనంతరం ఆయా సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టాలనీ ఆయన సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బడేటి చంటి మాట్లాడుతూ అన్నివర్గాల ప్రజలకు అండగా ఉండడమే తమ లక్ష్యమని తెలిపారు. దాంతోపాటూ ప్రజాసమస్యల పరిష్కారంపై కూడా ప్రత్యేక దృష్టిసారించినట్లు ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు....

# బస్ డిపో ఏర్పాటు చేయాలని మంత్రి ని కోరిన ఎమ్మెల్యే రోషన్ కుమార్



**చింతలపూడి న్యూస్, సెప్టెంబర్ 4, తెలుగు రాష్ట్రం ప్రతినిధి,** చింతలపూడి ప్రజల అవసరం గుర్తించి ఆర్టీసీ బస్ డిపో మంజూరు చేయాలని శాసనసభ్యులు సొంగా రోషన్ కుమార్ రాష్ట్ర రవాణా శాఖ మాత్యులు శ్రీ మడింపల్లి రాంప్రసాద్ రెడ్డి ని కోరారుఈ మేరకు గురువారం సచివాలయంలో మంత్రి రాంప్రసాద్ రెడ్డి ని నియోజకవర్గంలో నెలకొన్న భౌగోళిక, పరిస్థితిలు, రవాణా సౌకర్యాలు మంత్రి గారికి వివరించడం జరిగింది. ఈ మేరకు అవసరమైన చర్యలు చేపడతామని మంత్రి పేర్కొన్నారు

# ప్రధాని మోడీతోనే దేశ సర్వతోముఖాభివృద్ధి సాధ్యం

## -బిజెపిలో కార్యకర్తలదే హవా-కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ పిలుపు



**తాడేపల్లిగూడెం, సెప్టెంబర్ 4 (తెలుగురాష్ట్రం విలేకరి):**

ప్రధాని నరేంద్ర మోడీతోనే దేశ సర్వతో ముఖాభివృద్ధి సాధ్యమని, హామీలను ఖచ్చితంగా అమలుచేస్తున్న పార్టీ బిజెపియేనని కేంద్ర ఉక్కు భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస్ వర్మ పేర్కొన్నారు. తాడేపల్లిగూడెం కిరాణా మర్చంట్ హాల్లో గురువారం జరిగిన బిజెపి నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బిజెపి నియోజకవర్గ ఇన్చార్జి ఈతకోట తాతాజీ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిధి కేంద్రమంత్రి శ్రీనివాస్ వర్మ మాట్లాడుతూ నరేంద్ర మోడీ ప్రభుత్వం అనేక విప్లవాత్మక నిర్ణయాలు తీసుకుని హామీలను తక్షణమే అమలు చేస్తుందన్నారు. స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా ఢిల్లీ ఎర్రకోట నుంచి ప్రధాన నరేంద్ర మోడీ చేసిన ప్రసంగంలో త్వరలో ప్రజలకు దీపావళి కానుక ఇవ్వనన్నట్టు ప్రకటించారని, ఆ మేరకు జి.ఎస్.టిలో మార్పులు చేసి పన్ను రేట్లు గణనీయంగా తగ్గించి సామాన్య పేద ప్రజలకు ప్రయోజనం చేకూర్చే విధంగా ధరలు తగ్గింపునకు నిర్ణయం తీసుకోవడం హర్షణీయమన్నారు. నరేంద్ర మోడీ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు గురించి నాయకులు కార్యకర్తలు ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లాలని పిలుపునిచ్చారు. పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేయాలని, కొత్తవారిని చేర్చుకోవడం ద్వారా సమన్వయంతో పార్టీ బలాన్ని విస్తృతం చేయాలని నాయకులు కార్యకర్తలకు సూచించారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా బిజెపి నూతన అధ్యక్షులు టివిఎన్ మాధవ్ చేపట్టిన 'సారథ్యం' జిల్లా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. అందుకు అనుగుణంగా గ్రామ గ్రామాల నుంచి కార్యకర్తలు అభిమానులను భీమవరం తీసుకురావాలన్నారు. బిజెపి రాష్ట్ర కార్యదర్శి భోగిరెడ్డి ఆదిలక్ష్మి మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ పేదలకు వరాలు ప్రకటించారన్నారు. జీఎస్టీ పన్ను రేట్లు తగ్గించడం ద్వారా నిత్యవసర వస్తువులు ఔషధాలు వ్యవసాయ పరికరాలు వంటి ధరలు తగ్గుతాయని పేర్కొన్నారు. దీనివల్ల పేద ప్రజలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందన్నారు. పార్టీలో కష్టపడి పనిచేసే నాయకులు కార్యకర్తలకు సముచిత స్థానం కల్పించేందుకు కృషి చేస్తామని తెలిపారు. త్వరలో భీమవరంలో బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్ సారథ్యం లో జరగనున్న కార్యక్రమం విజయవంతం చేసేందుకు అందరు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. బిజెపి జిల్లా అధ్యక్షురాలు అయినంపూడి శ్రీదేవి మాట్లాడుతూ దేశం కోసం సామాన్య పేద ప్రజల కోసం నిరంతరం పాటుపడేది కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం అన్నారు. దేశానికి ప్రజలకు మేలు చేసే బిజెపి పార్టీని మరింత బలోపేతం చేసేందుకు త్వరలో భీమవరంలో జరగనున్న సారథ్యం కార్యక్రమాన్ని దిగ్విజయం చేసేందుకు కార్యకర్తలు ఉప్పెనలా తరలి రావాలని కోరారు. జిల్లా అభివృద్ధికి కేంద్రమంత్రి శ్రీనివాస్ వర్మ చేస్తున్న కృషి అభినందనీయమని కొనియాడారు. బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి ముళ్ళపూడి రేణుక మాట్లాడుతూ నరేంద్ర మోడీ నాయకత్వం లో దేశం అన్ని రంగాల్లోనూ విశేషాలు అభివృద్ధి సాధిస్తుందన్నారు. బిజెపి చరిత్రలో పశ్చిమగోదావరి జిల్లా ఒక గొప్ప మైలురాయని అభివర్ణించారు. తాడేపల్లిగూడెం నియోజకవర్గం బిజెపికి బలంగా ఉన్న ప్రాంతం అన్నారు. పార్టీ తరపున 2014- 2018 మధ్యకాలంలో స్వర్గీయ పైడికొండల మాణిక్యాలరావు మంత్రిగా సేవలందించారని గుర్తు చేశారు. రాష్ట్ర నూతన అధ్యక్షునిగా బాధ్యతలు చేపట్టిన మాధవ సారధ్యంలో త్వరలో భీమవరంలో జరగనున్న సారథ్యం కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రతి కార్యకర్త కలిసికట్టుగా కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర మంత్రిగా బాధ్యతలు చేపట్టి కేవలం 15 నెలల కాలం వేల కోట్ల రూపాయలు పశ్చిమగోదావరి జిల్లా అభివృద్ధికి నిధులు తెచ్చిన కేంద్రమంత్రి శ్రీనివాస్ వర్మ కృషి అభినందనీయమన్నారు. రాజ్యసభ సభ్యులుగా ఉన్న పాక వెంకట సత్యనారాయణ జిల్లా అభివృద్ధికి భాగస్వాములు అవుతారని పేర్కొన్నారు. ఒక కేంద్రమంత్రి రాజ్యసభ సభ్యులు ఇద్దరు మహిళలు రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహించడం బిజెపికి మరింత బలమని అన్నారు. బిజెపి జిల్లా పూర్వాధ్యక్షులు నార్నె తాతాజీ మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీకి పశ్చిమగోదావరి జిల్లా పట్టుగొమ్మ అన్నారు. రాష్ట్ర నూతన అధ్యక్షులు పివిఆర్ మాధవ్ నాయకత్వంలో చేపట్టిన సారథ్యం కార్యక్రమం అన్ని జిల్లాల్లోనూ దిగ్విజయమైందని పేర్కొన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలోనూ చేపట్టని విధంగా సారథ్యం కార్యక్రమం కొనసాగుతుందన్నారు. గతంలో సోము వీర్రాజు నాయకత్వంలో చేపట్టిన ప్రజాపోరు కార్యక్రమం దేశవ్యాప్తంగా ప్రాచుర్యం పొందిందన్నారు. నర్సాపురం పార్లమెంట్ ఇన్చార్జి పేరిచర్ల సుభాష్ రాజు, జాతీయ కౌన్సిల్ సభ్యులు కర్రి ప్రభాకర్ బాలాజీ, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కంచుమర్తి నాగేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి దత్తు ప్రసాద్ తదితరులు ప్రసంగించారు. ఈకార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి దత్తు ప్రసాద్, పార్లమెంట్ ఇంచార్జి పేరిచర్ల శుభాష్ రాజు, జాతీయ కౌన్సిల్ సభ్యులు కర్రి ప్రభాకర బాలాజీ, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కంచుమర్తి నాగేశ్వర రావు, జిల్లా ఉపాధ్యక్షులు తోట గంగరాజు, తాడేపల్లిగూడెం పట్టణ ఇంచార్జ్ ఆర్.పుల్లాజీ, బిజెపి జిల్లా మీడియా ఇంచార్జ్ నరిసే సోమేశ్వరరావు, పట్టణ అధ్యక్షుడు దువ్వా శ్రీనివాస్, రూరల్ అధ్యక్షులు సమయమంతుల కాశీ, పెంటపాడు మండల అధ్యక్షులు ఇమ్మంది శ్రీనివాస్, శ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోట రాంబాబు, పెదపోలు వీర రాఘవులు, జాతీయ కౌన్సిల్ సభ్యులు కర్రి ప్రభాకర బాలాజీ, పట్టణ పూర్వధ్యక్షులు ముప్పిడి సురేష్ రెడ్డి, జిల్లా నాయకులు కొండపల్లి నగేష్, పడమర విప్పర్రు సొసైటీ అధ్యక్షులు పసుపులేటి అమ్మిరాజు, గట్టిం సింధు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయం సాధన లో రైతులకు ఆదర్శంగా నిలుస్తున్న జిల్లా ప్రాజెక్టు మేనేజర్ DPM వెంకటేష్



**ఏలూరు, సెప్టెంబర్, 4 : తెలుగు రాష్ట్రం ప్రతినిధి,**

తన 6 ఎకరాల వ్యవసాయ భూమిలో పూర్తిగా ప్రకృతి సేద్యం ఏలూరు జిల్లా వ్యవసాయ రంగంలో ప్రకృతి వ్యవసాయానికి కొత్త దిక్సూచి చూపిస్తూ, జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వెంకటేశ్ ఆదర్శంగా నిలుస్తున్నారు. తనకు చెందిన 6 ఎకరాల భూమిని పూర్తిగా ప్రకృతి ఆధారిత వ్యవసాయానికి అంకితమిస్తూ, రసాయనాలు, కృత్రిమ ఎరువులను వాడకుండా, సంపూర్ణంగా ప్రకృతి వనరులపై ఆధారపడి సాగు చేస్తున్నారు. ఇది కేవలం పంటల ఉత్పత్తి కోసం మాత్రమే కాకుండా, భవిష్యత్ తరాల ఆరోగ్య భద్రతను దృష్టిలో ఉంచుకున్న బాధ్యతాయుత నిర్ణయం.వెంకటేశ్ ప్రకృతి వ్యవసాయం సిద్ధాంతాలను పాటిస్తూ, ఐదు లేయర్ మోడల్ వ్యవసాయ విధానాన్ని విజయవంతంగా అమలు చేస్తున్నారు. ఇందులో కొబ్బరి, కోకో, వాక, అరటి, మామిడి వంటి చెట్లను పై లేయర్ గా నాటి, మైక్రోక్లైమేట్ సృష్టించి, నేల తేమను నిల్వ చేయడమే కాకుండా పర్యావరణానికి అనుకూలమైన వ్యవస్థను నిర్మిస్తున్నారు. చెట్ల మధ్యలో బొబ్బర, నువ్వులు వంటి పంటలను సాగు చేసి, అదనపు ఆదాయం పొందుతున్నారు. అలాగే, పైనాపిల్, నేరేడు, నారింజ, మామిడి వంటి పండ్ల చెట్లను నాటి భూమిని బహుళ దశలుగా వినియోగిస్తున్నారు నెలను నిరంతరాం కప్పి ఉంచుతున్నారు. తన భూమిలో ప్రీమాన్సూన్ డ్రై సీడింగ్ విధానాన్ని అవలంబించడం ద్వారా వెంకటేశ్ ఎన్నో ప్రయోజనాలు పొందుతున్నారు. నిరంతర సాగు సాధ్యమవుతూ, నేలలో సూక్ష్మజీవులు పెరిగి భూమి ఆరోగ్యం మెరుగవుతోంది. సేంద్రీయ కార్బన్ స్థాయి పెరిగి పోషకాలు సమృద్ధిగా అందుతుండగా, నీటి నిల్వ సామర్థ్యం మెరుగై తక్కువ నీటితో సాగు కొనసాగుతోంది. వానపాముల సంఖ్య పెరగడం వల్ల నేల లోని సారం మెరుగై పంటల దిగుబడికి తోడ్పడుతోంది. ప్రత్యేకంగా 5000 లీటర్ల సామర్థ్యం గల ద్రవ జీవామృత%శీ% ట్యాంక్ నుండి డ్రిప్ ఇర్రిగేషన్ ద్వారా ప్రతి మొక్కకు జీవామృతాన్ని నేరుగా సరఫరా చేస్తున్నారు. ఈ విధానం ద్వారా తక్కువ నీటితో ఎక్కువ ప్రయోజనం లభిస్తోంది. అదే సమయంలో, భూమి జీవం పునరుద్ధరించబడుతోంది. వెంకటేశ్ తన భూమిలోని 30 సెంట్లలో " ఖుజిపటాలియా" అనే దేశీ వరి రకాన్ని సాగు చేస్తున్నారు. ఇది స్థానిక విత్తన సంపదను పరిరక్షించడంలో ఒక ముఖ్యమైన అడుగుగా నిలుస్తోంది. ప్రకృతి సంబంధిత నైపుణ్యం, భూమిపై ఉన్న అవగాహన, వ్యవసాయంపై అంకితభావం కారణంగా వెంకటేశ్ వ్యవసాయ భూమి ప్రస్తుతం ఇతర రైతులకు, విద్యార్థులకు మరియు వ్యవసాయ అధికారులకు జీవంత శిక్షణ కేంద్రంగా మారింది. తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి సాధించడానికి ప్రకృతి వ్యవసాయం సాధ్యమవుతుందని ఆయన ఉదాహరణ ద్వారా స్పష్టమవుతోంది. ఈ విధంగా వెంకటేశ్ ప్రకృతి వ్యవసాయాన్ని నూతన దిశగా తీసుకువెళుతూ, జిల్లాలో రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నారు.జిల్లా ప్రాజెక్టు మేనేజర్ గా వెంకటేశ్ బాధ్యత ప్రకారం ప్రకృతి వ్యవసాయం పై అవగాహన కల్పించడం, కొత్త మోడళ్లను ప్రోత్సహించడం ఆయన కర్తవ్యమే. కానీ, తానే స్వయంగా తన పొలంలో ఈ పద్ధతిని అమలు చేసి, ఆదర్శంగా నిలిచారు. ధిని ద్వారా ఆయన కేడర్ కు మరియు రైతులకు స్ఫూర్తిగా మారారు. ఇప్పుడు మరింత మంది రైతులు ఈ పద్ధతిని అవలంబించాలని ఆయన ఆకాంక్షిస్తున్నారు.


# దుస్తులు పంపిణి



**అమలాపురం: సెప్టెంబర్ 05( తెలుగురాష్ట్రం ప్రతినిధి )**

అమలాపురం లో వినాయక చవితి నవరాత్రుల సందర్భంగా లక్ష్మీ ఎలక్ట్రానిక్స్ అధినేత సాయిబాబా గారు సమకూర్చిన దుస్తులను గౌరవ ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు పేదలకు పంపిణి చేసారు., ఈ కార్యక్రమం లో రాష్ట్ర టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు మాజీ ఎ ఎమ్ సి చైర్మన్ చిక్కాల గణేష్, మాజీ ఎమ్. పి. పి బొర్రా ఈశ్వరరావు, కంచిపల్లి అబ్బులు మరియు తదితరులు పాల్గొన్నారు

## దున్నాల వారి వీధి విఘ్నేశ్వర స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు గారు



**తెలుగు రాష్ట్ర ప్రతినిధి, సెప్టెంబరు 4,**

దున్నాల వారి వీధి విఘ్నేశ్వర స్వామిని దర్శించుకున్న గౌరవ ఎమ్మెల్యే గౌరవ ఎమ్మెల్యే శ్రీ అయితాబత్తుల ఆనందరావు గారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ దున్నాల దుర్గ, జనసేన నాయకులు పిండి రాజా, చింతపూడి సత్తిబాబు, దున్నాల దిలీప్ మరియు తదితరులు పాల్గొన్నారు

# జీఎస్టీ తగ్గింపుతో రైతాంగానికి ప్రయోజనం - ఎంపీ పుట్టా మహేష్ కుమార్

- జీఎస్టీ శ్లాబుల్లో మార్పుల పట్ల ఎంపీ పుట్టా మహేష్ కుమార్ హర్షం. ●తమ విజ్ఞప్తులు ఫలించాయని ఆనందం.
- పురుగుమందులు, వ్యవసాయ పరికరాల ధరలు తగ్గి రైతులకు లబ్ధి
- ప్రధానికి, కేంద్ర మంత్రికి కృతజ్ఞతలు తెలిపిన ఎంపీ పుట్టా మహేష్ కుమార్.



**ఏలూరు, సెప్టెంబర్, 4 : తెలుగు రాష్ట్రం ప్రతినిధి,**

జీఎస్టీ శ్లాబుల్లో కేంద్రం తీసుకొచ్చిన మార్పుల పట్ల ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ హర్షం వ్యక్తం చేశారు. నిన్న కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన జరిగిన జీఎస్టీ మండలి సమావేశంలో ప్రస్తుతం ఉన్న నాలుగు శ్లాబుల విధానాన్ని రెండు శ్లాబులకు తీసుకురావడంతో పాటు, బీడీ ఆకులపై, పలు వ్యవసాయ పరికరాలపై జీఎస్టీ తగ్గించారు. ట్రాక్టర్లు, ట్రాక్టర్ టైర్లు, విడిభాగాలు, స్పెసిఫైడ్ బయో పెస్టిసైడ్స్, మైక్రో న్యూట్రియంట్స్, స్ప్రింక్లర్లు సహా డ్రిప్ ఇరిగేషన్ వ్యవస్థ, ఇతర వ్యవసాయ పరికరాలపై జీఎస్టీ 5 శాతానికి తగ్గించడంతో రైతన్నకి లబ్ధి కలుగుతుందని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ అన్నారు. వ్యవసాయ పనిముట్ల, యంత్రాల, కొన్ని రకాల పురుగుమందుల ధరలు తగ్గి రైతాంగానికి మేలు చేకూరుతుందని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ అన్నారు.రైతన్నపై భారం తగ్గించేందుకు ఏలూరు ఎంపీ కృషి.. . వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న ఇబ్బందులు, సాగు ఖర్చు పెరిగిపోవటం, పొగాకు కొనుగోళ్లు, పామాయిల్ ధరలు, కోకో రైతుల సమస్యలపై అనేకమార్లు తాను కేంద్ర వ్యవసాయ, వాణిజ్య శాఖల మంత్రులు, అధికారుల దృష్టికి తీసుకు వచ్చిన విషయాన్ని ఈ సందర్భంగా ఎంపీ గుర్తు చేశారు.తమ విజ్ఞప్తులను పరిశీలించి ముఖ్యంగా బయో పెస్టిసైడ్స్, వ్యవసాయ పరికరాలు వంటివాటిపై జీఎస్టీ 18 శాతం నుంచి 5 శాతానికి తగ్గిస్తూ వ్యవసాయ రంగానికి మేలు చేకూర్చుతూ నిర్ణయం తీసుకున్న కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కి, జీఎస్టీ కౌన్సిల్ కి, ప్రధాని నరేంద్ర మోదీ గారికి, ఏలూరు రైతాంగం తరపున ఎంపీ పుట్టా మహేష్ కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ నిర్ణయాల వల్ల ముఖ్యంగా డ్రిప్ పరికరాల ధరలు తగ్గి ఏలూరు జిల్లాలో పొగాకు, కోకో, పామాయిల్ ఎక్కువగా సాగు చేస్తున్న రైతులకు మేలు జరుగుతుందని, అదేవిధంగా పురుగుమందులు, వ్యవసాయ పరికరాల ధరలు తగ్గి, ఆ మేరకు రైతాంగంపై భారం తగ్గుతుందని ఎంపీ వెల్లడించారు. ఇదేవిధంగా భవిష్యత్తులో కూడా రైతాంగానికి మేలు జరిగేలా తనవంతు కృషి చేస్తానని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ స్పష్టం చేశారు. రైతు ప్రతినిధుల హర్షం.. పురుగుమందులు, వ్యవసాయ పరికరాలపై జీఎస్టీని తగ్గించడం పట్ల పలువురు రైతు సంఘాల నాయకులు, రైతు ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. ఆలాగే రైతులు, కార్మిక సంఘాల నేతలు ఎంతోకాలంగా కోరుతున్నట్లుగా బీడీ ఆకులపై జీఎస్టీ 18 శాతం నుంచి 7 శాతానికి తగ్గించడం పట్ల కూడా వారు సంతోషం వ్యక్తం చేశారు. జీఎస్టీ తగ్గింపు నిర్ణయం తీసుకున్న కేంద్ర ప్రభుత్వానికి, రైతుల సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందించి తమ కష్ట నష్టాలను కేంద్రం దృష్టికి తీసుకెళ్తూ పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్న ఎంపీ పుట్టా మహేష్ కుమార్ గారికి కూడా వారు కృతజ్ఞతలు తెలిపారు..



తెలుగురాష్ట్రం దినపత్రిక

# సుస్థిర ఘన వ్యర్ధాలు మరియు వినియోగించిన నీటి నిర్వహణ పై శిక్షణ కార్యక్రమం





**అమలాపురం, సెప్టెంబర్ 04 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛ అంధ్ర కార్పోరేషన్ వారి ఆధ్వర్యంలో సాహాస్ మరియు వాష్ సంస్థల వారిచే అమలాపురం పురపాలక సంఘ చైర్మన్, వైస్ చైర్మనులు, వార్డు సభ్యులు మరియు కో–ఆప్షన్ సభ్యులకు సుస్థిర ఘన వ్యర్ధాల నిర్వహణ మరియు వినియోగించిన నీటి నిర్వహణపై అవగాహన మరియు శిక్షణా కార్యక్రమమును అమలాపురం పట్టణంలోని హెూటల్ గ్రాండ్ పార్కు నందు గురువారం నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా గౌరవ శాసన సభ్యులు అయితాబత్తుల ఆనందరావు గారు మరియు శాసన మండలి సభ్యులు శ్రీ కుడుపూడి సూర్యనారాయణ గారు విచ్చేసినారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న శాసన సభ్యులు శ్రీ అయితా బత్తుల ఆనందరావు గారు మాట్లాడుతూ స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్రను సాదించడానికి గౌరవ వార్డు సభ్యులు అందరూ కృషి చేయాలని, ఘన మరియు ద్రవ వ్యర్ధాల నిర్వహణ, చెత్త రహిత పట్టణం కొరకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. గౌరవ శాసన మండలి సభ్యులు శ్రీ కుడుపూడి సూర్యనారాయణరావు గారు మాట్లాడుతూ ఘన మరియు ద్రవ వ్యర్ధాల నిర్వహణ, చెత్త సేకరణ, పునర్వినియోగంపై శిక్షణా కార్యక్రమం నిర్వహించడం, వ్యర్ధాల నిర్వహణకు సంబందించి చట్టాలపై అవగాహన కల్పించడం చాలా సంతోషదాయకమని తెలియజేశారు. వాష్ మరియు సాహాస్ సంస్థలకు చెందిన సీనియర్ శిక్షణా నిపుణులు స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ భారత్ మిషన్ – 2.0, ఘన వ్యర్ధాల నిర్వహణ నిబంధనలు – 2016, నమస్తే పధకం, ఓడిఎఫ్, ఓడిఎఫ్ం, వాటర్ం, చెత్త రహిత పట్టణాలు, స్వచ్ఛ సర్వేక్షణ్ సర్వే వ్యూహాలు, ప్రతిపాదిత సామర్థ్య అభివృద్ధి ( బిల్డింగ్ కెపాసిటీ ) ప్రణాళిక గురించి సమగ్రంగా వార్డు సభ్యులకు వివరించి, అవగాహన కల్పించి, శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వి.నిర్మల్ కుమార్, మున్సిపల్ చైర్ పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, వాష్ మరియు సాహాస్ సంస్థల టెక్నికల్ మరియు శిక్షణా నిపుణులు వి.శశాంక్, ఎస్.రఘు, ఏంజెల్, అర్జున్ ప్రసాద్, సిహెచ్.వి.ఎస్.అనూష మౌనిక. పందు రాము, గౌరవ వార్డు సభ్యులు, కో–ఆప్షన్ మెంబర్లు, మున్సిపలి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




# కోటిపల్లి - నర్సాపురం రైల్వే లైన్ పనుల వేగం పెంచాలి

## దక్షిణ మధ్య రైల్వే జోనల్ సమావేశంలో ఎంపీ హరీష్ బాలయోగి



**అమలాపురం, సెప్టెంబర్ 04 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

కోటిపల్లి – నర్సాపురం రైల్వే లైన్ పై ఉన్న కోర్టు కేసులు తొలగి నిర్మాణానికి మార్గం సుగమం కావడంతో పనుల వేగం పెంచాలని అమలాపురం ఎంపీ గంటి హరీష్ బాలయోగి రైల్వే అధికారులను కోరారు. సికింద్రాబాద్ లోని రైల్వే నిలయంలో బుధవారం జరిగిన దక్షిణ మధ్య రైల్వే 76వ జోనల్ రైల్వే వినియోగదారుల సంప్రదింపుల కమిటీ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో హరీష్ బాలయోగి మాట్లాడుతూ ఆయా పనులపై చర్చించి త్వరిగతిన గోదావరి నదులపై బ్రిడ్జి స్ట్రక్చర్ పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే ద్వారపూడి రైల్వే స్టేషన్ వసతుల కల్పన కోసం సూచించిన విధంగా చర్యలు తీసుకుని ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలన్నారు.అదేవిధంగా రాజోలు పరిధిలోని దిండి వద్ద గోదావరి నదిలో వంగిన పిల్లర్ పై తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. కోనసీమ ప్రయాణీకుల అవసరాల దృష్ట్యా అమలాపురం పట్టణంలో రైల్వే రిజర్వేషన్ కౌంటర్ ఏర్పాటుకు చర్యలు వేగవంతం చేసే విధంగా ఆయా అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని ఎంపీ హరీష్ బాలయోగి కోరారు.

# పేదల పెన్నిధి, పేదల పక్షపాతి ముఖ్యమంత్రి చంద్రబాబు

**-సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీలో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు.**

**మొత్తం 102 మందికి రూ.57,84,809ల విలువైన చెక్కుల పంపిణీ**

**కూటమి అధికారంలోకి వచ్చాక 18 దఫాలుగా రూ.3.50 కోట్ల చెక్కుల పంపిణీ....**





**తెలుగు రాష్ట్ర ప్రతినిధి, సెప్టెంబరు 4,**

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పేదలకు పెద్దన్నగా, పేదల పెన్నిధిగా, పేదల పక్షపాతిగా వ్యవహరిస్తున్నారని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు వ్యాఖ్యానించారు. రావులపాలెంలో కాపు కళ్యాణ మండపం గురువారం జరిగిన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ల నేతృత్వంలో కూటమి ప్రభుత్వంలో సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీలో భాగంగా కొత్తపేట నియోజకవర్గంలో నాలుగు మండలాలకు కలిపి 98 చెక్కులు, 4 ఎల్వోసీలు మొత్తం 102 మందికి రూ.57,84,809లు సహాయంగా అందించామని తెలిపారు. కూటమి అధికారంలోకి వచ్చాక గత 15 నెలల కాలంలోనే 18 దఫాలుగా 434 మందికి రూ. 3.50కోట్లు సీఎం రిలీఫ్ ఫండ్ కింద చెక్కులను పంపిణీ చేయడం జరిగిందన్నారు. గత వైసిపి ప్రభుత్వం హయాంలో సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు అందని ద్రాక్షగా ఉండేదని ఆయన విమర్శించారు. అటు ఆరోగ్యశ్రీలో వీలుకాని, ఇన్సూరెన్సు లేని పేద వర్గాల వారు ఆస్తులు అమ్ముకుని, అప్పుల పాలై గతంలో సీఎం రిలీఫ్ ఫండ్ సాయం కోసం ఎదురు చూస్తూ ఉంటే అరకొరగా, తమ వంధి మాగధులకు మాత్రమే ఇచ్చిన దుస్థితి జగన్ హయంలో నెలకొని ఉండేదని వ్యాఖ్యానించారు. కూటమి అధికారంలోకి వచ్చాక చేతికి వెన్నెముక లేదు అన్నట్లుగా విరివిగా పేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి అందుతుందని అన్నారు. అనంతరం చెక్కుల పంపిణీ కార్యక్రమానికి హాజరై థాంక్యూ సీఎం సార్ అంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తున్న చిన్నారులతో ముచ్చటించారు. వారి కుటుంబ సభ్యుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో భాగంగా ఆత్రేయపురం మండలానికి చెందిన 18 మందికి రూ.11.05 లక్షలు,రావులపాలెం మండలానికి చెందిన 38 మందికి రూ.22.33 లక్షలు, కొత్తపేట మండలానికి చెందిన 30 మందికి రూ.16.27 లక్షలు, ఆలమూరు మండలానికి చెందిన 16 మందికి రూ.8.18లక్షలు, 4 ఎల్వోసీలకు గాను రూ.8.10లక్షలు మొత్తం 102 మందికి రూ.57,84,809ల విలువైన చెక్కులను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ఆకుల రామకృష్ణ,గుత్తుల రాంబాబు, ముదునూరి వెంకటరాజు,ఈదాల సత్యనారాయణ మూర్తి, కొప్పిశెట్టి ప్రసాద్, గనిశెట్టి వీరేష్ మరియు కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



# దుస్తులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు



**అమలాపురం, సెప్టెంబర్ 04 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

వినాయక చవితి నవరాత్రుల సందర్భంగా లక్ష్మీ ఎలక్ట్రానిక్స్ అధినేత సాయిబాబా సమకూర్చిన దుస్తులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు , రాష్ట్ర టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు. ఈ కార్యక్రమంలో మాజీ amc చైర్మన్ చిక్కాల గణేష్, మాజీ mpp బొర్రా ఈశ్వరరావు, కంచిపల్లి అబ్బులు మరియు తదితరులు పాల్గొన్నారు




అమలాపురం శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు



# విద్యుత్ సమస్యలపై విద్యుత్ అధికారులు ఎమ్మెల్యే అయితాబత్తుల సమీక్ష

**అల్లవరం మండలం తెలుగు రాష్ట్ర ప్రతినిధి,**

విద్యుత్ సమస్యలపై అల్లవరం మండలం సత్య కస్తూరి ఫంక్షన్ హాల్ లో విద్యుత్ అధికారులు మరియు అల్లవరం మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన నాయకులు కార్యకర్తలతో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు

# అరువు తెచ్చుకున్న బ్యాట్‌తో సెంచరీ..

## మోడల్ సూసైడ్ కేసులో విచారణ..

**తన రెండవ టీ20ఐ మ్యాచ్‌లో సెంచరీ సాధించిన టీం ఇండియా ఓపెనింగ్ బ్యాట్స్‌మన్ అభిషేక్ శర్మకు 25 ఏళ్లు నిండాయి. జులై 2024లో జింబాబ్వేతో జరిగిన తన రెండవ మ్యాచ్‌లో అతను సెంచరీ చేశాడు. ఈ సమయంలో ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే అతను అరువు తెచ్చుకున్న బ్యాట్‌తో ఈ సెంచరీ సాధించాడు. ఈ ఎడమచేతి వాటం బ్యాట్స్‌మన్ ఇప్పటివరకు టీ20ఐలో రెండు సెంచరీలు సాధించాడు. దీనికి ముందు కూడా, ఈ ఆటగాడు చాలా అద్భుతమైన ఇన్నింగ్స్‌లు ఆడాడు. అతను కేవలం 7 మ్యాచ్‌ల్లో 1200 కంటే ఎక్కువ పరుగులు చేసి అందరినీ ఆశ్చర్యపరిచాడు. అతని గురించి ఐదు కీలక విషయాలను ఇప్పుడు తెలుసుకుందాం..**



### తన స్నేహితుడి బ్యాట్‌తో సెంచరీ..

అభిషేక్ శర్మ జులై 2024లో జింబాబ్వేతో జరిగిన మ్యాచ్ ద్వారా తన అంతర్జాతీయ కెరీర్‌ను ప్రారంభించాడు. మొదటి మ్యాచ్‌లో ఖాతా కూడా తెరవలేకపోయాడు. కానీ, రెండవ మ్యాచ్‌లో అద్భుతాలు చేశాడు. తన స్నేహితుడు శుభ్‌మాన్ గిల్ బ్యాట్‌తో అద్భుతమైన సెంచరీ సాధించాడు.

అభిషేక్ శర్మ కేవలం 47 బంతుల్లో 8 సిక్సర్లు, 7 ఫోర్లతో 100 పరుగులు చేశాడు. శుభ్‌మాన్ గిల్ అభిషేక్ బాల్య స్నేహితుడు. జింబాబ్వేపై అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడటానికి ముందే అభిషేక్ గొప్ప పని చేశాడు. అభిషేక్ శర్మ పుట్టినరోజు సెప్టెంబర్ 4, ఈ సందర్భంగా బీసీసీఐ అతనికి శుభాకాంక్షలు తెలిపింది.

### విజయ్ మెర్జెంట్ ట్రోఫీలో అద్భుతాలు..

అభిషేక్ శర్మ అండర్-16 జట్టులో అద్భుతంగా రాణించాడు. 2015-16లో విజయ్ మెర్జెంట్ ట్రోఫీలో, అభిషేక్ 7 మ్యాచ్‌ల్లో 1200 పరుగులు చేశాడు. ఈ సమయంలో, అతను టోర్నమెంట్‌లో అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా నిలిచాడు. అతను 57 వికెట్లు కూడా పడగొట్టాడు. దీని కారణంగా, అతనికి రాజ్ సింగ్ దుంగార్పూర్ అవార్డు లభించింది.

### తండ్రి మొదటి కోచ్..

టీం ఇండియా ఓపెనింగ్ బ్యాట్స్‌మన్ అయిన ఈ వ్యక్తి మూడున్నర సంవత్సరాల వయసులోనే క్రికెట్ ఆడటం ప్రారంభించాడు. అతని తండ్రి రాజ్ కుమార్ శర్మ అమృత్‌సర్‌లోని స్థానిక క్రికెట్ మైదానంలో అతనికి శిక్షణ ఇచ్చాడు. అతని తండ్రి అండర్-22 నార్త్ జోన్ స్థాయి వరకు ఆడాడు. అతను ప్రారంభంలో అభిషేక్‌కు శిక్షణ ఇచ్చాడు. అతని కెరీర్‌ను రూపొందించడంలో కీలక పాత్ర పోషించాడు. క్రికెట్ ప్రపంచంలో వేగంగా పేరు సంపాదించిన అభిషేక్ కూడా ఒక వివాదంలో చిక్కుకున్నాడు.

### వివాదంలో చిక్కుకున్న అభిషేక్ శర్మ..

2024 సంవత్సరంలో, సన్‌రైజర్స్ హైదరాబాద్ తరపున ఆడిన ఈ ఆటగాడు ఒక వివాదంలో చిక్కుకున్నాడు. మోడల్ తానియా సింగ్ ఆత్మహత్యకు సంబంధించి అభిషేక్‌ను సూరత్ పోలీసులు విచారణ కోసం పిలిచారు. అభిషేక్ తానియా మరణానికి ముందు చాలా నెలలు ఆమెతో పరిచయం కలిగి ఉన్నాడు. అయితే, అభిషేక్ త్వరలోనే ఈ వివాదం నుంచి బయటపడ్డాడు.

### ఈ విషయంలో అభిషేక్ ముందంజలో..

టీం ఇండియా ఓపెనింగ్ బ్యాట్స్‌మన్ అభిషేక్ శర్మ తన పేరు మీద ఇలాంటి రికార్డులు చాలా ఉన్నాయి. వీటిని ఇప్పటివరకు ఎవరూ బద్దలు కొట్టలేకపోయారు. అతను ఐపీఎల్‌లో అత్యధిక వ్యక్తిగత స్కోరు చేశాడు. ఐపీఎల్ 2025లో, పంజాబ్ కింగ్స్‌పై కేవలం 55 బంతుల్లో 14 ఫోర్లు, 10 సిక్సర్లతో 141 పరుగులు చేశాడు. ఇది ఇప్పటివరకు ఐపీఎల్‌లో అత్యధిక వ్యక్తిగత స్కోరు.

దీంతో పాటు, అతను టీ20ఐలో భారతదేశం తరపున అత్యధిక వ్యక్తిగత స్కోరును కూడా చేశాడు. అభిషేక్ ఫిబ్రవరి 2025లో ఇంగ్లాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో 135 పరుగులు చేశాడు. 2024 సంవత్సరంలో అత్యధిక సిక్సర్లు కొట్టిన తొలి భారతీయుడు అభిషేక్. అతను 42 సిక్సర్లు కొట్టాడు. ఇది కాకుండా, అతను ఇప్పటివరకు టీ20లో 7 సెంచరీలు చేశాడు.

# శిఖర్ ధావన్‌కు సమన్లు జారీ చేసిన ఈడీ..

## ఏ కేసులోనో తెలుసా.. లిస్ట్‌లో పేర్లు చూస్తే షాకే..?

భారత జట్టు మాజీ ఓపెనర్‌కు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ సమన్లు ??జారీ చేసింది. బెట్టింగ్ యాప్ ప్రమోషన్‌కు సంబంధించిన కేసులో ఆయనను ప్రశ్నించడానికి పిలిచారు. నివేదికల ప్రకారం, ఈ దర్యాప్తు ధావన్ సోషల్ మీడియాలో ప్రమోట్ చేస్తున్న ఆన్‌లైన్ బెట్టింగ్ ప్లాట్‌ఫామ్ 1xBetకి సంబంధించినది. ఇప్పుడు ఈ విషయంలో తన పాత్రను స్పష్టం చేయడానికి ED శిఖర్ ధావన్‌ను దర్యాప్తులో చేరమని కోరింది. ఇటీవల, టీమిండియా మాజీ క్రికెటర్లు సురేష్ రైనా, హర్భజన్ సింగ్‌లను కూడా ED ప్రశ్నించిన సంగతి తెలిసిందే.



### దర్యాప్తు లిస్ట్‌లో ఎవరెవరున్నారంటే..

గత సంవత్సరం నుంచి అనేక మంది బాలీవుడ్, సౌత్ సినీ నటులు, క్రికెటర్లు అక్రమ బెట్టింగ్ యాప్‌లను ప్రోత్సహించినందుకు దర్యాప్తులో ఉన్నారు. ఈ జాబితాలో విజయ్ దేవరకొండ, రానా దగ్గుబాటి, ప్రకాష్ రాజ్, హర్భజన్ సింగ్, ఊర్వశి రౌతేలా, సురేష్ రైనా ఉన్నారు. ఇప్పుడు శిఖర్ ధావన్ పేరు కూడా దీనికి జోడించారు.

ఇటీవల భారత మాజీ క్రికెటర్లు సురేష్ రైనా, హర్భజన్ సింగ్ ED ముందు తమ వాంగ్మూలాలను నమోదు చేశారు. ఇప్పుడు ఈ కేసులో శిఖర్ ధావన్‌కు కూడా %జుణ% సమన్లు ??జారీ చేసింది. ఈ సమయంలో, ఆగస్టులో అరెస్టయిన కర్ణాటక కాంగ్రెస్ ఎమ్మెల్యే కేసీ వీరేంద్ర నిర్వహిస్తున్న ఆన్‌లైన్ బెట్టింగ్ సైట్‌లు చాలా తక్కువ సమయంలోనే రూ.2,000 కోట్లకు పైగా సంపాదించాయని ED ఆరోపించింది.

### కీలక ఆరోపణలు చేసిన ఈడీ..

అక్రమ ఆన్‌లైన్ బెట్టింగ్ ద్వారా ప్రజలను మోసం చేసిన కేసులో ప్రధాన నిందితుడైన వీరేంద్ర, దుబాయ్‌లోని అతని సహచరులు వివిధ గేట్‌వేలు, ఫిన్‌టెక్ సర్వీస్ ప్రొవైడర్లను ఉపయోగించి అనేక గేమింగ్ వెబ్‌సైట్‌లను నడుపుతున్నారని, నిధులను సేకరించడానికి, వారి చట్టవిరుద్ధ కార్యకలాపాలను నిజమైన ఇ-కామర్స్ వ్యాపారాలుగా దాచిపెట్టారని కూడా అది పేర్కొంది. ఆగస్టులో సిక్కింకు చెందిన చిత్రదుర్గ ఎమ్మెల్యే కె.సి. వీరేంద్రను ఈడీ అరెస్టు చేసింది. అక్కడ ఆయన క్యాసినో అద్దెకు తీసుకోవడానికి వెళ్లారు. ప్రస్తుతం ఈడీ కస్టడీలో ఉన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల కొత్త చట్టం ద్వారా రియల్ మనీ ఆన్‌లైన్ గేమింగ్‌ను నిషేధించింది. అక్రమ బెట్టింగ్ కేసులో ఈడీ నిరంతరం చర్యలు తీసుకుంటోంది.

# ఐపీఎల్ టికెట్లపై భారీగా పెరిగిన జీఎస్టీ..

కొత్త వస్తు సేవల పన్ను రేట్లు ఇప్పుడు క్రికెట్‌పై కూడా ప్రభావం చూపనున్నాయి. ప్రపంచంలోనే అతిపెద్ద లీగ్ అయిన ఇండియన్ ప్రీమియర్ లీగ్ టిక్కెట్లు ఖరీదైనవి కానున్నాయి. దీని కారణంగా, అభిమానులు మ్యాచ్ చూడటానికి స్టేడియానికి వెళ్లాలని అనుకుంటే, వారి జేబులపై మరింత భారం పడేలా ఉంది. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన సెప్టెంబర్ 3న న్యూఢిల్లీలో జరిగిన GST కౌన్సిల్ సమావేశంలో, IPL టిక్కెట్లపై %+ూ% పెంచాలని నిర్ణయించారు. ఇందులో 12 శాతం పెరుగుదల ఉంది. దీని ప్రభావం %ఖూ% 2026 సమయంలో చూడొచ్చు.



### టిక్కెట్లపై భారీగా జీఎస్టీ..

జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో, ఐపీఎల్ టిక్కెట్లపై 40 శాతం జీఎస్టీ విధించాలని నిర్ణయించారు. గతంలో ఇది 28 శాతం ఉండేది. దీని కారణంగా, ఐపీఎల్ టిక్కెట్లు మరింత ఖరీదైనవి కావొచ్చు. ఇది టికెట్ అభిమానుల జేబులపై ప్రత్యక్ష ప్రభావాన్ని చూపుతుంది. మ్యాచ్ చూడటానికి స్టేడియానికి వెళితే, టికెట్ కొనడానికి ఎక్కువ చెల్లించాల్సి ఉంటుంది. గతంలో, రూ.1000 విలువైన ఐపీఎల్ టిక్కెట్లపై 28% జీఎస్టీ విధించారు. దీంతో టికెట్ మొత్తం రూ.1280 అయింది. ఇప్పుడు కొత్త రేటు ప్రకారం, ఈ టికెట్ ధర రూ.1400 అవుతుంది. అంటే, అభిమానులు రూ.120 ఎక్కువగా చెల్లించాల్సి ఉంటుంది. అదేవిధంగా, రూ.500 టికెట్‌పై, ఇప్పుడు రూ.640కి బదులుగా రూ.700 చెల్లించాల్సి ఉంటుంది. మరోవైపు, రూ.2000 టికెట్‌పై అభిమానులు రూ.2560కి బదులుగా రూ.2800 చెల్లించాల్సి ఉంటుంది. దీని ప్రభావం ఐపీఎల్ 2026 సమయంలో స్టేడియంలో కనిపిస్తుంది.

### స్టేడియంలో అభిమానుల కొరత..

ఐపీఎల్ టిక్కెట్ల ధర పెరిగితే, స్టేడియంలో అభిమానుల సంఖ్య తగ్గే అవకాశం ఉంది. ఐపీఎల్ మ్యాచ్‌ల సమయంలో, పెద్ద సంఖ్యలో అభిమానులు మ్యాచ్‌ను ఆస్వాదించడానికి స్టేడియానికి వెళతారు. కానీ, ఇప్పుడు వారి సంఖ్య తగ్గవచ్చు. ఇది ఐపీఎల్ ప్రజాదరణను ప్రభావితం చేయవచ్చు. మరోవైపు, గుర్తింపు పొందిన క్రీడా కార్యక్రమాలపై జీఎస్టీ విధించలేదు. గుర్తింపు పొందిన క్రీడా కార్యక్రమానికి టికెట్ ధర రూ. 500 అయితే, దానిపై జీఎస్టీ ఉండదు. అంతకంటే ఎక్కువ ధర ఉన్న టిక్కెట్లపై 18 శాతం జీఎస్టీ ఉంటుంది. దీంతో పాటు, బెట్టింగ్, జూదం, లాటరీ, గుర్రపు పందెం, ఆన్‌లైన్ మనీ గేమింగ్ వంటి కార్యకలాపాలపై 40 శాతం జీఎస్టీ విధించాలని కూడా జీఎస్టీ కౌన్సిల్ నిర్ణయించింది.

# క్రికెట్ హిస్టరీలో ఫస్ట్ టైం..

## 17 ఏళ్లకే వరల్డ్ కప్ ఛాన్స్..

**మహిళల వన్డే ప్రపంచ కప్ 2025 భారత్, శ్రీలంకలో సెప్టెంబర్ 30 నుండి ప్రారంభం కానుంది. ఈ టోర్నమెంట్ కోసం దక్షిణాఫ్రికా క్రికెట్ జట్టు బుధవారం తమ జట్టును ప్రకటించింది. ఈ జట్టులో 17 ఏళ్ల వికెట్ కీపర్-బ్యాట్స్‌మెన్ కరాబో మేసోకు చోటు లభించింది. ప్రపంచ కప్ వంటి పెద్ద ఈవెంట్‌లో 17 ఏళ్ల కరాబో మేసోకు అవకాశం ఇవ్వడం, ఆమెపై సౌతాఫ్రికా క్రికెట్ బోర్డుకు ఉన్న నమ్మకాన్ని చూపిస్తుంది. మేసో ఈ సంవత్సరం మార్చిలో శ్రీలంకపై టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌తో సీనియర్ జట్టులో అడుగుపెట్టింది. ఆమె సౌతాఫ్రికా తరపున ఇప్పటివరకు రెండు వన్డేలు, ఐదు టీ20 మ్యాచ్‌లు ఆడింది. గతంలో 2023, 2025లో రెండు అండర్-19 మహిళల టీ20 ప్రపంచ కప్‌లలో కూడా పాల్గొంది.**




### మాజీ కెప్టెన్‌కు నిరాశ

లారా వోల్వార్ట్ కెప్టెన్సీలో ప్రపంచ కప్ కోసం సౌతాఫ్రికా 15 మంది సభ్యుల జట్టును ప్రకటించింది. ఈ జట్టులో ఇటీవల రిటైర్మెంట్ నుంచి తిరిగి వచ్చిన మాజీ కెప్టెన్ డాన్ వాన్ నీకెర్క్కు చోటు దక్కలేదు. గాయం కారణంగా అంతర్జాతీయ క్రికెట్ నుంచి రిటైర్మెంట్ తీసుకున్న నీకెర్క్, ప్రపంచ కప్‌లో ఆడాలనే ఆశతోనే మళ్లీ తిరిగి వచ్చింది. కానీ, ఆమెకు నిరాశ ఎదురైంది. జట్టులో సునే లుస్, మరిజాన్ క్యాప్, నాన్‌కులులేకో మ్లాబా, క్లో ట్రయాన్, తాజ్మిన్ బ్రిట్స్ వంటి కీలక ఆటగాళ్లు ఉన్నారు.

### జట్టు బలం, బాధ్యతలు

కెప్టెన్ లారా వోల్వార్ట్, తాజ్మిన్ బ్రిట్స్‌తో కలిసి ఇన్నింగ్స్‌ను ప్రారంభిస్తారు. దక్షిణాఫ్రికాకు మిడిల్, లోయర్ ఆర్డర్‌లో మరిజాన్ క్యాప్, సునే లుస్, నాండూమిసో షంగాసే, నదీన్ డి క్లార్క్, క్లో ట్రయాన్, అన్నేరీ డెర్క్సెన్, అన్నేకే బాష్ వంటి ఆల్‌రౌండర్లు ఉన్నారు. సీనియర్లు అయిన సైనలో జఫ్తా, యువ కరాబో మేసోతో కలిసి వికెట్ కీపింగ్ బాధ్యతలను పంచుకుంటారు. బౌలింగ్‌లో, లెఫ్ట్ హ్యాండ్ స్పిన్నర్ మ్లాబా స్పిన్ దాడికి నాయకత్వం వహిస్తారు. మసాబాటా క్లాస్, తుమి సెక్హుఖునే ఫాస్ట్ బౌలింగ్ విభాగాన్ని పంచుకుంటారు. క్యాప్, ట్రయాన్, డి క్లార్క్ బౌలింగ్‌ను మరింత బలోపేతం చేస్తారు.

ప్రపంచ కప్ సెప్టెంబర్ 30న ప్రారంభమై, నవంబర్ 2న ఫైనల్ మ్యాచ్‌తో ముగుస్తుంది. సౌతాఫ్రికా క్రికెట్ జట్టు తమ మొదటి మ్యాచ్‌ను గువాహటిలో ఇంగ్లాండ్‌తో ఆడుతుంది.

### సౌతాఫ్రికా జట్టు (15 మంది సభ్యులు)

లారా వోల్వార్ట్ (కెప్టెన్), అయబొంగా ఖాకా, క్లో ట్రయాన్, నదీన్ డి క్లార్క్, మరిజాన్ క్యాప్, తాజ్మిన్ బ్రిట్స్, సైనలో జఫ్తా, నాన్‌కులులేకో మ్లాబా, అన్నేరీ డెర్క్సెన్, అన్నేకే బాష్, మసాబాటా క్లాస్, సునే లుస్, కరాబో మేసో, తుమి సెక్హుఖునే, నాండూమిసో షంగాసే.

# భావోద్వేగభరితమైన, గర్వించదగ్గ క్షణం..

## భారత యువ శక్తిని ప్రపంచానికి చాటి చెబుతా: మహాఆర్యమన్ సింధియా

**మధ్యప్రదేశ్ క్రికెట్ అసోసియేషన్ కమాండ్ ఇప్పుడు ఒక నవయువకుడి చేతికి దక్కింది. కేవలం 29 సంవత్సరాల వయసులోనే మహాఆర్యమన్ సింధియా దాని అతి పిన్న వయస్కుడైన అధ్యక్షుడయ్యాడు. ఆయన గ్వాలియర్ రాజకుటుంబానికి చెందిన మహాఆర్యమన్ సింధియా. ఆయన తండ్రి జ్యోతిరాదిత్య సింధియా ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వంలో మంత్రిగా ఉన్నారు. తాత మాధవరావు సింధియా కూడా గతంలో MPCA అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహించారు.**



అధ్యక్షుడిగా ఎన్నికైన మహాఆర్యమన్ సింధియా మాట్లాడుతూ, ఇది చాలా భావోద్వేగభరితమైన, గర్వించదగ్గ క్షణం అన్నారు. ఒక ముఖ్యమైన బాధ్యతను స్వీకరించినందున మాత్రమే కాదు, ఈ పాత్ర బలమైన వారసత్వాన్ని కొనసాగిస్తున్నందుకు కూడా అన్నారు. తాత మాధవరావు సింధియా ఈ పదవిని నిర్వహించారు. యువతలో ప్రతిభను గుర్తించడంలో, క్రీడా స్ఫూర్తి పెంపొందించడంలో కీలక పాత్ర పోషించారు. MPCAలో క్రికెట్ పరిపాలనకు వృత్తి నైపుణ్యం, నిర్మాణాత్మక ప్రక్రియలను తీసుకురావడం ద్వారా తండ్రి జ్యోతిరాదిత్య సింధియా దానిని మరింత ముందుకు తీసుకెళ్లారు. వారి ఆశీస్సులతో వారు నిర్మించిన క్రీడా ప్రపంచానికి విలువను జోడించడం, ఆ వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తానన్నారు. ఈ పదవి మరింత బాధ్యతను పెంచిందన్నారు. జనాభాలో దాదాపు 70% మంది 35 ఏళ్లలోపు యువత ఉన్న దేశంలో యువకుడిగా.. తాజా దృక్పథాన్ని, శక్తిని తీసుకువస్తానని మహాఆర్యమన్ సింధియా తెలిపారు.

మహాఆర్యమన్ సింధియా తన పాఠశాల విద్యను డెహ్రాడూన్‌లోని దేశంలోని అత్యుత్తమ డూన్ స్కూల్‌లో పూర్తి చేశారు. ఆ తర్వాత విదేశాలకు వెళ్లి 2019లో యేల్ యూనివర్సిటీ నుండి పొలిటికల్ సైన్స్ అండ్ గవర్నమెంట్‌లో బ్యాచిలర్ డిగ్రీని పొందారు. ఆ తర్వాత లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌లో సమ్మర్ స్కూల్ ప్రోగ్రామ్‌లో కూడా పాల్గొన్నాడు. అక్కడ ఇంటర్నేషనల్ రిలేషన్స్ అండ్ అఫైర్స్ చదివారు.

మహాఆర్యమన్ తన చదువుతో పాటు పని అనుభవాన్ని కూడగట్టుకుంటూనే ఉన్నాడు. ఆగస్టు 2014లో, అతను భూటాన్‌లోని గ్రాస్ నేషనల్ హ్యాపీనెస్ సెంటర్‌లో ఇంటర్న్‌షిప్ చేశాడు. దీని తర్వాత, అతను కొంతకాలం భారత ప్రభుత్వ ఆర్థిక మంత్రిత్వ శాఖలో కూడా పనిచేశాడు. తరువాత 2015లో, అతను లండన్‌లోని క్రిస్టీస్‌లో పనిచేశాడు. తరువాత 2016లో, అతను న్యూఢిల్లీలోని %ఖ×ణూ×% (ఆధార్ కార్డ్ అథారిటీ)కి దోహదపడ్డాడు. 2017లో, అతను సాఫ్ట్ బ్యాంక్‌తో, 2018లో న్యూయార్క్‌లోని మాక్రో అడ్వైజరీ పార్టనర్‌లతో అనుభవాన్ని పొందాడు.

వీటితో పాటు, 2019 నుండి 2021 వరకు, అతను ముంబైలోని %దీజ+% (బోస్టన్ కన్సల్టింగ్ గ్రూప్)లో అసోసియేట్‌గా ఉన్నాడు. దీని తరువాత, అతను కుటుంబ వ్యాపారం, కొత్త స్టార్టప్‌లపై దృష్టి పెట్టాడు. అతను అండర్‌సౌండ్స్ ఎంటర్‌టైన్‌మెంట్, జై విలాస్ ప్యాలెస్‌లకు డైరెక్టర్ అయ్యాడు. 2022 సంవత్సరంలో, అతను టెక్ స్టార్టప్‌లను కూడా ప్రారంభించాడు. అంటే, అతను టెక్నాలజీ, వ్యాపార ప్రపంచంలో కూడా బలంగా ముందుకు అడుగు పెట్టాడు.

2022 సంవత్సరంలో, మహార్యమాన్ గ్వాలియర్ డివిజన్ క్రికెట్ అసోసియేషన్ (%+ణజూ%) వైస్ ప్రెసిడెంట్‌గా తన ప్రస్తానాన్ని ప్రారంభించారు. అదే సంవత్సరంలో, అతను %పీజూ%లో జీవితకాల సభ్యుడయ్యాడు. 2024 సంవత్సరంలో, అతను మధ్యప్రదేశ్ %ు%20 లీగ్‌ను ప్రారంభించాడు. ఇది రాష్ట్రంలోని యువ క్రికెటర్లకు కొత్త వేదికను ఇచ్చింది. ఈ చొరవ క్రికెట్ పట్ల ఆయనకున్న ప్రేమను, నిర్వహణ పట్ల ఆయనకున్న అవగాహనను స్పష్టంగా చూపిస్తుంది. ఇప్పుడు ఆయన %పీజూ% అధ్యక్షుడయ్యారు.

తెలుగురాష్ట్రం దినపత్రిక



# బాలీవుడ్‌లోకి మీనాక్షి ఎంట్రీ !

ఈ ఏడాది 'సంక్రాంతికి వస్తున్నాం' చిత్రంతో మంచి విజయాన్ని అందుకుని, దక్షిణాది ప్రేక్షకుల్లో ప్రత్యేక గుర్తింపు పొందిన నటి మీనాక్షి చౌదరి ఇప్పుడు బాలీవుడ్ ప్రేక్షకులను ఆకట్టుకోవడానికి సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే తెలుగు, తమిళ భాషల్లో వరుస సినిమాలతో బిజీగా ఉన్న ఈమె, తాజాగా బాలీవుడ్ స్టార్ హీరో జాన్ అబ్రహం ప్రధాన పాత్రలో రూపొందనున్న 'ఫోర్స్ 3' సినిమాలో కథానాయికగా ఎంపికైనట్లు సమాచారం.

'ఫోర్స్' సిరీస్‌లో ఇది మూడవ భాగం. గత రెండు భాగాలు యాక్షన్, మాస్ సన్నివేశాలతో మంచి స్పందనను పొందాయి. ఇప్పుడు 'ఫోర్స్ 3'లో కథానాయికగా మీనాక్షి చౌదరిని ఎంపిక చేయాలని చిత్ర బృందం నిర్ణయించిందట. ఇప్పటికే ఈ విషయంపై మీనాక్షితో చర్చలు ప్రారంభమయ్యాయని, ఆమె ఇందులో నటించడానికి ఆసక్తిగా ఉన్నారని బాలీవుడ్ వర్గాలు చెబుతున్నాయి.

**తెలుగులోనూ ఫుల్ బిజీ**

ఇదిలా ఉండగా, మీనాక్షి ప్రస్తుతం నవీన్ పొలిశెట్టి సరసన నటిస్తున్న 'అనగనగా ఒక రాజు' చిత్రం షూటింగ్‌తో బిజీగా ఉంది. అలాగే మరికొన్ని తెలుగు ప్రాజెక్టులు చర్చల దశలో ఉన్నట్లు సమాచారం.

**దక్షిణాది నుంచి బాలీవుడ్‌కు మరో బ్యూటీ!**

తమిళ, తెలుగు పరిశ్రమల నుండి బాలీవుడ్‌లోకి వెళ్లే నటీమణుల జాబితాలో మీనాక్షి చౌదరి పేరు త్వరలో చేరనుంది. మంచి స్క్రీన్ ప్రెజెన్స్, నటనలో వైవిధ్యం, గ్లామర్ కలగలిపిన ఈమెకు 'ఫోర్స్ 3' ఒక పాన్-ఇండియా బ్రేక్ కావచ్చు. అయితే, 'ఫోర్స్ 3' అధికారిక ప్రకటనతో మీనాక్షి బాలీవుడ్ ప్రవేశంపై స్పష్టత రానుంది.

# రికార్డుల వేట మొదలుపెట్టిన 'ఓజీ'

## ఉత్తర అమెరికాలో రికార్డులను బద్దలు కొట్టిన పవన్ కళ్యాణ్ తుఫాను



ఇంకా ట్రైలర్ కూడా విడుదల కాకముందే, పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ నూతన చిత్రం 'ఓజీ' ఉత్తర అమెరికా బాక్సాఫీస్ వద్ద సంచలనాలు సృష్టిస్తూ, తన ఆధిపత్యాన్ని చాటుకుంది. ప్రీమియర్ ప్రీ-సేల్స్‌లో 1 మిలియన్ డాలర్లను రాబట్టి, ఈ సంచలనాత్మక ఘనతను అత్యంత వేగంగా సాధించిన చిత్రంగా నిలిచింది. పవన్ కళ్యాణ్ స్టార్ డమ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరంలేదు. తన అసాధారణ క్రేజ్ తో ఎన్నో రికార్డులను ఖాతాలో వేసుకున్నారు. ఇప్పుడు 'ఓజీ' తుఫానుతో మరోసారి బాక్సాఫీస్ లెక్కలు సరి చేస్తున్నారు. అభిమానులతో పాటు, ట్రేడ్ వర్గాలు సైతం పవన్ కళ్యాణ్ సృష్టిస్తున్న సరికొత్త రికార్డుల పట్ల ఆసక్తిగా ఉన్నారు. ఓజాస్ గంభీర అనే శక్తివంతమైన పాత్రలో పవన్ కళ్యాణ్ కనువిందు చేయనున్న ఈ చిత్రం సెప్టెంబర్ 25న ప్రేక్షకుల ముందుకు రానుంది. విడుదలకు మూడు వారాల ముందే.. ఓజీగా ఆయన బాక్సాఫీస్‌ను శాసిస్తున్నారు. ఆకలితో ఉన్న చిరుతపులిలా, పవన్ కళ్యాణ్ ఒకదాని తర్వాత ఒకటి అన్నట్టుగా రికార్డులను వేటాడుతున్నారు. ఓజీ చిత్రం నుండి ఇప్పటిదాకా విడుదలైన ప్రతి పోస్టర్, ప్రతి గ్లింప్స్ సామాజిక మాధ్యమాల్లో సంచలనం సృష్టించాయి. 'ఓజీ'పై అంచనాలు రోజురోజుకి పెరిగిపోతున్నాయి. పవన్ కళ్యాణ్ అభిమానులు మాత్రమే కాకుండా, ప్రపంచవ్యాప్తంగా ఉన్న సినీ ప్రియులంతా ఈ సినిమా కోసం ఎంతగానో ఎదురుచూస్తున్నారు. 'ఓజీ' వసూళ్ల పరంగా బాక్సాఫీస్ వద్ద ప్రకంపనలు సృష్టించి, మైలురాయి చిత్రంగా నిలుస్తుంది అనడంలో ఎటువంటి సందేహం లేదు. పవన్ కళ్యాణ్ గంభీరగా గర్జించనున్న 'ఓజీ' చిత్రంలో ఇమ్రాన్ హష్మీ, ప్రియాంక అరుళ్ మోహన్, ప్రకాష్ రాజ్, శ్రియా రెడ్డి, అర్జున్ దాస్ వంటి అద్భుతమైన తారాగణం ఉన్నారు. దర్శకుడు సుజీత్ ఈ చిత్రాన్ని ఒక సినిమాటిక్ తుఫానుగా రూపొందిస్తున్నారు. డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై డీవీవీ దానయ్య, కళ్యాణ్ దాసరి ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. సంగీత సంచలనం ఎస్. తమన్ సంగీతం అందిస్తున్నారు. సెప్టెంబర్ 25, 2025న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా భారీస్థాయిలో విడుదల కానుంది. 'ఓజీ' అనే శక్తివంతమైన టైటిల్ కి తగ్గట్టుగానే.. ఉత్తర అమెరికా బాక్సాఫీస్ వద్ద పవన్ కళ్యాణ్ తుఫాను సృష్టిస్తున్నారు. త్వరలోనే ఈ తుఫాను ప్రపంచవ్యాప్తంగా విస్తరించనుంది.

# చిన్న చిత్రాలనూ ఆదరించండి : ఆలీ



'చిత్ర పరిశ్రమలో ఇప్పుడు చిన్నా, పెద్దా అనే తేడాలు సినిమాల్లో లేవు. కథా కథనం బాగుంటే చిన్న సినిమాలు సైతం బాక్సాఫీసు వద్ద హిట్ మూవీస్‌గా నిలుస్తున్నాయి. సమాజ రుగ్మతలు రూపుమాపాలనే లక్ష్యంతో తీసిన సినిమా 'స్పిరిట్' (ఈజ్ నాట్ వన్). దర్శకుడు, నిర్మాతలతో మాట్లాడాను. ఎక్కడో మారుమూల పల్లెవాసులు ఇలా సినిమా తీయటం ఎంతో సంతోషమేసింది. ఆత్మవిశ్వాసంతో వెంకటనర్సమ్మ ముందుకు సాగారు. ఆమె కోరిన లక్ష్యం విజయవంతం కావాలి. చిన్న సినిమా అయినా 'స్పిరిట్'ను అందరూ ఆశీర్వదించాలి. థియేటర్‌లో ఈ సినిమాను చూసి బలపర్చండి' అని ప్రేక్షకులను సినీనటుడు ఆలీ కోరారు. 8త్ వండర్ సినిమా బ్యానర్‌పై 'స్పిరిట్ (ఈజ్ నాట్ వన్)' సినిమాను సిహెచ్ వెంకట రవీంద్రనాథ్ ఎంఎస్ దర్శకత్వంలో తెరకెక్కించారు. చెన్నెబోయిన చిన వెంకటస్వామి సమర్పణలో నిర్మాతగా చెన్నెబోయిన నరసమ్మ వ్యవహరించారు. సంగీతం సంతోష్ కావాలి, డిఒపి పి.భరత్‌రాజ్ కమల్, ఎడిటర్ కెవివై పాపారావు. రవిబాబు, సత్యప్రకాష్, చిత్రం శ్రీను, రాజశేఖర్, సైదులు, నాగ్‌తేజ్, చిట్టిబాబు, రమ్య, రజనీ, డాలీ నటించారు. త్వరలో విడుదల కానున్న ఈ సినిమా ప్రచార కార్యక్రమాలు జరుగుతున్నాయి.

# ఎన్టీఆర్ ఫొటోకు రికార్డు ధర



టాలీవుడ్ కథానాయకుడు ఎన్టీఆర్‌కు ప్రపంచవ్యాప్తంగా అభిమానులు ఉన్నారు. ఆయన ఫోటోకు కూడా మంచి క్రేజ్ ఉందని అర్థమైంది. బులా రుబీ అనే పెన్సిల్ ఆర్టిస్ట్ ఎన్టీఆర్ ఫొటోను తన టాలెంట్‌తో ఆవిష్కరించారు. ఆ పెన్సిల్ ఆర్ట్ ఏకంగా రూ.1,45,300కు అమ్ముడైంది. ఈ విషయాన్ని ఆర్టిస్ట్ బులా రూబీ ట్విటర్ ద్వారా తెలియజేశారు. 'నా పెన్సిల్ ఆర్ట్ ఇలా చరిత్ర సృష్టిస్తుందని కలలో కూడా ఊహించలేదు. ఈరోజు నా జూనియర్ ఎన్టీఆర్ పెన్సిల్ ఆర్ట్ ఇప్పటివరకు అమ్ముడైన వాటిలో అత్యంత ఖరీదైనది.' అంటూ ట్విటర్‌లో పోస్ట్ చేశారు.

# "ఘాటీ" ట్రైలర్ పై ప్రభాస్ ప్రశంసలు

అనుష్క లీడ్ రోల్ లో నటిస్తున్న "ఘాటీ" సినిమాకు తన బెస్ట్ విశెస్ అందించారు రెబెల్ స్టార్ ప్రభాస్. "ఘాటీ" సినిమా ట్రైలర్ ఆకట్టుకుందని, ఇంటెన్స్ గా ఉండి ఆసక్తి కలిగించిందని ఆయన ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్ చేశారు. ఈ సినిమా టీమ్ అందరికీ మంచి సక్సెస్ రావాలని ఆయన విశెస్ తెలిపారు. ఇలాంటి పవర్ ఫుల్ రోల్ లో అనుష్కను స్క్రీన్ మీద చూసేందుకు వెయిట్ చేస్తున్నానని ప్రభాస్ తన పోస్ట్ లో పేర్కొన్నారు. అనుష్క శెట్టితో పాటు విక్రమ్ ప్రభు కీ రోల్ లో నటిస్తున్న "ఘాటీ" చిత్రాన్ని యువి క్రియేషన్స్ సమర్పణలో ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్స్ పై రాజీవ్ రెడ్డి, సాయి బాబు జాగర్లమూడి పాన్ ఇండియా ప్రాజెక్ట్ గా నిర్మిస్తున్నారు. క్రిష్ జాగర్లమూడి దర్శకత్వం వహించారు. ఈ నెల 5న ఈ సినిమా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. "ఘాటీ" సినిమాపై మూవీ లవర్స్ లో మంచి అంచనాలు ఉన్నాయి.

# ఆ ఒక్క పాత్ర చేయాలనే కోరిక ఉంది

## అనుష్క శెట్టి

**నెగటివ్ పాత్రలో నటించాలని ఉందని చెప్పిన అనుష్క**

**క్రిష్ దర్శకత్వంలో 'ఘాటి' చిత్రంతో**

**ప్రేక్షకుల ముందుకు వస్తున్న స్వీటీ**

**ఇందులో శీలావతి అనే విభిన్నమైన, శక్తిమంతమైన పాత్రలో నటిస్తున్నట్లు వెల్లడి**

టాలీవుడ్ స్టార్ హీరోయిన్ అనుష్క శెట్టి తన కెరీర్‌కు సంబంధించి ఒక ఆసక్తికరమైన కోరికను బయటపెట్టారు. అవకాశం వస్తే పూర్తిస్థాయి నెగటివ్ పాత్రలో నటించడానికి తాను సిద్ధంగా ఉన్నానని ఆమె స్పష్టం చేశారు. చిత్ర పరిశ్రమలో 20 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా, ఇంకా ఎలాంటి పాత్రలు చేయాలనుకుంటున్నారని మీడియా అడిగిన ప్రశ్నకు ఆమె ఈ విధంగా బదులిచ్చారు. "బలమైన కథ, క్యారెక్టర్ లభిస్తే కచ్చితంగా ప్రతినాయకి పాత్రను పోషిస్తాను" అని అనుష్క తెలిపారు. ప్రస్తుతం ఆమె, ప్రముఖ దర్శకుడు క్రిష్ జాగర్లమూడి దర్శకత్వంలో తెరకెక్కిన 'ఘాటి' సినిమా విడుదల కోసం ఎదురుచూస్తున్నారు. ఈ చిత్రం ప్రమోషన్లలో భాగంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ శుక్రవారం ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ సినిమాలో తాను 'శీలావతి' అనే అద్భుతమైన పాత్రలో కనిపిస్తానని చెప్పారు. "ఇంతకుముందు నేను ఇలాంటి పాత్ర చేయలేదు. ఇందులో ఎన్నో అందమైన కోణాలుంటాయి. అరుంధతి, రుద్రమదేవి, బాహుబలి, భాగమతి చిత్రాల్లో నా పాత్రలు ఎంత బలంగా ఉంటాయో, 'ఘాటి'లోని శీలావతి పాత్ర కూడా అంతే శక్తిమంతంగా ఉంటుంది. కానీ ఇది చాలా విభిన్నమైనది" అని ఆమె వివరించారు. గతంలో క్రిష్, అనుష్క కాంబినేషన్‌లో వచ్చిన 'వేదం' చిత్రం ఘన విజయం సాధించడంతో 'ఘాటి'పై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ అంచనాలను సినిమా అందుకుంటుందా? అని అడగ్గా, "కచ్చితంగా అందుకుంటుంది. 'వేదం'లోని సరోజ పాత్రకు కొనసాగింపుగా ఒక సినిమా చేయాలనుకున్నాం. కానీ 'ఘాటి' రూపంలో ఒక అద్భుతమైన కథ కుదిరింది. క్రిష్ ఎప్పుడూ నాకు మంచి పాత్రలు ఇస్తారు. శీలావతి పాత్ర నా కెరీర్‌లో చిరకాలం గుర్తుండిపోతుంది" అని అనుష్క అన్నారు. సినిమా చిత్రీకరణ ఎక్కువగా కొండ ప్రాంతాల్లో జరిగిందని, దీనికోసం శారీరకంగా చాలా కష్టపడాల్సి వచ్చిందని ఆమె తెలిపారు. అయితే కొత్త ప్రదేశాల్లో షూటింగ్ చేయడం ఎంతో థ్రిల్లింగ్‌గా అనిపించిందని, క్రిష్ పక్కా ప్లానింగ్‌తో షూటింగ్ పూర్తి చేశారని పేర్కొన్నారు. భవిష్యత్ ప్రాజెక్టుల గురించి మాట్లాడుతూ, "కొత్త కథలు వింటున్నాను. త్వరలో ఒక మంచి లైనప్ ఉంటుంది. నేను మలయాళంలో ఒక సినిమా చేస్తున్నాను. అదే నా తొలి మలయాళ చిత్రం. తెలుగులో కూడా ఒక ఆసక్తికరమైన సినిమా ప్రకటన ఉంటుంది" అని అనుష్క తన రాబోయే ప్రణాళికలను పంచుకున్నారు.



TELUGU RASTRAM . Printed, Published and Owned by A.RAJASEKHAR. Printed at Ajay Sri Printers, D.No. 4/151, Aithabathulavari centre, S.Yanam, Uppalaguptam Mandal, Dr B.R. ambedkar konaseema Dist, A.P Published at D.No. 4-151, Aithabathulavari Centre, S.Yanam, Uppalaguptam Mandal, Dr B.R. ambedkar konaseema Dist, A.P. Editor: A.RAJASEKHAR, . RNI NO. APTEL/2016/66202, email: telugurastram2016@gmail.com, Phone No. 8074368339